www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -124 మంగళవారం18 ఆగస్టు 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# పేదల ఆరోగ్యం మా బాధ్యత



## డాక్టర్ మర్రిచెన్నారెడ్డి టిమ్స్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

**విద్యావైద్యరంగాలకు ప్రాధాన్యతిస్తున్నాం**

**ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్ కోసమే రూ.5,226 కోట్లు ఖర్చుచేశాం**

**వైద్యారోగ్య శాఖకు రూ.21,800 వెచ్చించాం**

**టెంకాయలు కొట్టి వదిలేసినోళ్లు టిమ్స్ కట్టామని గొప్పలా**

**ప్రభుత్వ ఆస్పత్రుల్లో అదనపు**

**సమయం పనిచేసే డాక్టర్లకు ప్రోత్సాహకాలివ్వండి**



**హైదరాబాద్ ఆగస్ట్ 17,(ప్రజావినికిడి):** పేదల వైద్యానికి ప్రాధాన్యమిస్తున్నామనీ, వారి ఆరోగ్యం తమ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్యావైద్య రంగాల కు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సనత్‌నగర్ లో నూతనంగా నిర్మించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆస్పత్రిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిం చారు. **మిగతా 2లో...**

# బీజేపీ జాతీయ నూతన కార్యవర్గం..

## నూతన కార్యవర్గం ప్రకటించిన నితిన్ నబీన్



**13 మందికి జాతీయ ఉపాధ్యక్ష పదవులు**

**జాతీయ ప్రధాన కార్యదర్శులుగా 8 మంది..**

**కార్యదర్శులుగా 16 మంది పేర్లు ఖరారు**

**కొత్త టీమ్కు ప్రధాని మోడీ అభినందనలు**



**న్యూఢిల్లీ:ఆగస్ట్ 17,(ప్రజావినికిడి):** బీజేపీ అధిష్ఠానం పార్టీ నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులుగా పురందేశ్వరి, వసుంధరా రాజె, రామ్ మాధవ్ సహా 13 మంది పేర్లను ప్రకటించారు. **మిగతా 2లో...**

# నాగబాబుకు కేబినెట్ హోదాతో పదవి..

**నాగబాబుకు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి**

**కేబినెట్ హోదాతో నియామకం చేపట్టిన ప్రభుత్వం**

**రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం సాధించడమే లక్ష్యం**

**సోదరుడి నియామకంపై హర్షం వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం**



**అమరావతి ఆగస్ట్ 17,(ప్రజావినికిడి):** జనసేన సీనియర్ నేత, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో, నాగబాబు సోదరుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి పక్షాల నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా నాగబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. **మిగతా 2లో...**

# ప్రజల్లో 22ఎ గందరగోళం

**డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా**

**సీలింగ్ చట్టం ఎత్తేశాక మళ్లీ ఎందుకొచ్చింది**

**సిఎం రేవంత్ ఇల్లు జాబితాలో వచ్చాకనే చురుకు**

**పాలనపై పట్టు లేదనడానికి ఇదే పెద్ద నిదర్శనం**

**మీడియా సమావేశంలో ప్రభుత్వ తీరుపై హరీష్ ఆగ్రహం**

**హైదరాబాద్,ఆగస్ట్ 17,(ప్రజావినికిడి):** రాష్ట్రంలో 22ఎ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తోందని.. బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. ఎవరి భూమి 22ఎలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని మాజీ హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు. **మిగతా 2లో...**



# కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ కొనసాగుతుంది

**గత ప్రభుత్వం పక్కాగా అమలు చేయలేదు**

**అందుకే కోర్టుల్లో కేసులు వచ్చాయి**

**దీనిపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తున్నాం**

**ధర్నాలు చేసే వారు పథకల తప్పిదాలపై మాట్లాడాలి**

**మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి**

**హైదరాబాద్, ఆగస్ట్ 17,(ప్రజావినికిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి షాది, ముబారక్ గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కళ్యాణ లక్ష్మి పథకంపై వివరించారు. కళ్యాణ్ లక్ష్మీ పథకం పై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను **మిగతా 2లో...**



# స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం

**ఐఎస్ఐ అండతో పనిచేస్తున్న షాజాద్ భట్టి ఉగ్ర నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశామన్న అమిత్ షా**

**స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దాడుల కుట్రను భగ్నం చేశామన్న అమిత్ షా**

**14 రాష్ట్రాల్లో విస్తృతంగా ఆపరేషన్లు.. 200 మందికి పైగా అరెస్ట్**



2లో.



# మండలిలో డీఎస్సీ రగడ..

**బొత్సకు అచ్చెన్నాయుడు కౌంటర్**

**డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్న అచ్చెన్నాయుడు**

**విద్యాశాఖ మంత్రిగా బొత్స విఫలమయ్యారంటూ అచ్చెన్న విమర్శలు**

**అచ్చెన్న వ్యాఖ్యలపై దుమారం, క్షమాపణ చెప్పాలని విపక్షం పట్టు**

**గందరగోళం మధ్య శాసనమండలి రెండు సార్లు వాయిదా**

**అమరావతిఆగస్ట్ 17,(ప్రజావినికిడి):** గత ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులకు 'మెగా డీఎస్సీ' ఇస్తామని ఆశలు రేపి, చివరికి ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా మోసం చేసిన వైసీపీకి ఇప్పుడు డీఎస్సీ నియామకాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన**మిగతా 2లో...**

# తెలంగాణలో సర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల.

**ముసాయిదాలో 2.64 కోట్ల మంది పేర్లు**

**92 లక్షల మందికి నోటీసులు ఇవ్వనున్నట్లు వెల్లడి**

**నోటీసులకు సెప్టెంబర్ 16 వరకు గడువు**

**ఏఎస్‌డీడీ జాబితాలో 73 లక్షల మంది**

**హైదరాబాద్ ఆగస్ట్ 17,(ప్రజావినికిడి):** తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. సర్‌కు ముందు రాష్ట్రంలో 3,38,26,448 మంది ఓటర్లు**2లో...**



# ఏపీపై ఎల్ నినో పంజా..

## తీవ్ర వర్షాభావంపై అసెంబ్లీలో చంద్రబాబు వివరణ

**అమరావతి ఆగస్ట్ 17,(ప్రజావినికిడి):** రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని, దీని కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాసనసభలో సోమవారం జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే చాలా తక్కువగా నమోదవుతోందని, ఈ క్లిష్ట పరిస్థితిపై ప్రజలకు అసెంబ్లీ వేదికగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు.ఈ ఏడాది వర్షపాతం అంచనాలను, వాస్తవ పరిస్థితులను ముఖ్యమంత్రి గణాంకాలతో సహా వివరించారు.



## నాగబాబుకు కేబినెట్ హోదాతో పదవి..

**మొదటిపేజీ తరువాయి**

ఈ నియామకంపై పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. నాగబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ, "వికసిత్ ఆంధ్రప్రదేశ్2047 సాధనలో భాగంగా రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం పచ్చదనం సాధించాలనే లక్ష్యాన్ని ఆయన సమర్థమైన నాయకత్వంలో ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు. అటవీ విస్తీర్ణం పెంపు, పునర్వనీకరణ, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలు నాగబాబు నాయకత్వంలో మరింత వేగవంతంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

భవిష్యత్తు తరాలకు పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను అందించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కీలక బాధ్యతలో నాగబాబు విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వంలో జనసేన నేతకు కేబినెట్ హోదాతో పదవి లభించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

## తెలంగాణలో సర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల.

**మొదటిపేజీ తరువాయి** ఉన్నారని తెలిపారు. గడువులోగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన 2,64,87,214 మంది పేర్లతో ముసాయిదా జాబితా రూపొందించినట్లు చెప్పారు.మొత్తం ఓటర్లలో 78.03 శాతం మంది పేర్లు ముసాయిదా జాబితాలో ఉన్నాయని సుదర్శన్ రెడ్డి తెలిపారు. మరోవైపు 73 లక్షల మంది ఓటర్లు ఏఎస్‌డీడీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్) జాబితాలో ఉన్నట్లు చెప్పారు. అన్‌మ్యాప్డ్ జాబితాలో ఉన్న 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు.నోటీసులు అందుకున్నవారు తమ వివరాలపై వివరణ ఇచ్చేందుకు సెప్టెంబర్ 16 వరకు గడువు ఉంటుందని తెలిపారు. ఈ నోటీసులను బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) పోస్టు ద్వారా పంపించనున్నట్లు చెప్పారు. తమ పేరు జాబితాలో లేకపోయినా అర్హత ఉన్నవారు ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

## మండలిలో డీఎస్సీ రగడ..

**మొదటిపేజీ తరువాయి**

బొత్స సత్యనారాయణ, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుని ఇప్పుడు మండలిలో డీఎస్సీపై నీతులు చెప్పడం సిగ్గుచేటని ఆయన ఘాటుగా విమర్శించారు.సోమవారం ప్రారంభమైన ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాల తొలిరోజే శాసనమండలి 'మెగా డీఎస్సీ-2025' అంశంతో దద్దరిల్లింది. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అయితే, మండలి చైర్మన్ కె. మోషేను రాజు వాయిదా తీర్మానాన్ని తిరస్కరించి, ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ఈ అంశంపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.చైర్మన్ నిర్ణయంతో ఏకీభవించని వైసీపీ సభ్యులు, సభా కార్యకలాపాలను అడ్డుకుంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. డీఎస్సీ పేరుతో మూడు లక్షల మంది నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని, క్రీడల కోటాలో తమకు నచ్చిన వారికి ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై సభలో చర్చ జరగాలని పట్టుబట్టారు.

బొత్స ఆరోపణలపై అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందించారు. "గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని మీరు ఇప్పుడు మాట్లాడుతున్నారా? అధికారంలో ఉన్నప్పుడు చేతకాక, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక మండలిలో ప్రశ్నలు వేయడం రాజకీయ ద్వంద్వ నీతి కాదా?" అని బొత్సను నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులకు సకాలంలో ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అయితే, దీన్ని అడ్డుకునేందుకు వైసీపీ ఏకంగా 300 కోర్టు కేసులు వేసిందని అచ్చెన్నాయుడు ఆరోపించారు.ఈ క్రమంలో బొత్స సత్యనారాయణను ఉద్దేశించి అచ్చెన్నాయుడు చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. దీంతో వైసీపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. గందరగోళం నడుమ చైర్మన్ సభను వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత, అచ్చెన్నాయుడు తన అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బొత్స డిమాండ్ చేశారు. దీనికి మంత్రి స్పందిస్తూ, తాను వాడిన పదాలు అన్‌పార్లమెంటరీ కావని, ఒకవేళ చైర్మన్ రూలింగ్ ఇస్తే క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అయినప్పటికీ వైసీపీ సభ్యులు నిరసన కొనసాగించడంతో, చైర్మన్ సభను రెండోసారి వాయిదా వేశారు.

## స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం

పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్' అనే ఉగ్రవాద ముఠాను పూర్తిగా నిర్మూలించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దేశంలో విధ్వంసక దాడులు చేసేందుకు పన్నిన భారీ కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయని, ఈ క్రమంలో 14 రాష్ట్రాల్లో 200 మందికి పైగా నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.ఈ మేరకు అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వివరాలను వెల్లడించారు. భద్రతా బలగాలు సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌ను ఛిన్నాభిన్నం చేసినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు.కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆగస్టు 12వ తేదీన దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లలో మొత్తం 253 మందిని అదుపులోకి తీసుకోగా, 200 మందికి పైగా నిందితులను అధికారికంగా అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 62 మంది, హర్యానాలో 52, ఢిల్లీలో 51, పంజాబ్‌లో 44 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ముద్రలు కలిగిన గ్రెనేడ్లు, పిస్టళ్లు, మందుగుండు సామాగ్రితో పాటు గూఢచర్యం కోసం వినియోగించే రహస్య కెమెరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.షాజాద్ భట్టి నెట్‌వర్క్, ప్రధానంగా గ్రెనేడ్, ఐఈడీలు, పెట్రోల్ బాంబు దాడులతో పాటు లక్షిత హత్యలకు కుట్ర పన్నుతున్నట్లు అధికారులు వివరించారు. పోలీసు స్టేషన్లు, రక్షణ సంస్థలు, మతపరమైన ప్రదేశాలపై నిఘా ఉంచేందుకు ఈ ముఠా స్థానికులకు భారీగా నగదు చెల్లించిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

## బీజేపీ జాతీయ నూతన కార్యవర్గం..

**మొదటిపేజీ తరువాయి**

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్మృతి ఇరానీని ప్రకటించారు. పార్టీ జాయింట్ కోఆర్డినేటర్‌గా విష్ణువర్ధన్‌రెడ్డిని నియమించారు. కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జ్‌గా తరుణ్ చుగ్, ాదీజ మోర్చా నూతన అధ్యక్షుడిగా అమర్‌పాల్ మౌర్య పేర్లను ప్రకటించింది పార్టీ అధిష్ఠానం. అలాగే, సంస్థాగత జనరల్ సెక్రటరీగా దీ.ా.సంతోష్, సంస్థాగత జాయింట్ జనరల్ సెక్రటరీగా శివప్రకాష్ పేర్లను ఖరారు చేసింది బీజేపీ అధినాయకత్వం. కాగా, బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు చోటు దక్కలేదు. పైగా ఉపాధ్యక్షురాలిగా ఉన్న డీకే అరుణను తప్పించారు.పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నేతృత్వంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. అనుభవజ్ఞులైన నాయకులు, యువ నాయకుల సమ్మేళనంతో జాతీయ కార్యవర్గంలో ప్రాంతయ ప్రాతినిధ్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శులలో ఒకరిగా మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కీలక సంస్థాగత పాత్రలోకి తిరిగి రావడం ఒక పెద్ద పరిణామం. తెరపైకి వచ్చిన మరో కీలక పేరు రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే. 13 మంది జాతీయ ఉపాధ్యక్షులలో ఆరుగురు మహిళలు ఉండటం, పార్టీ కీలక పదవులలో మహిళలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రయత్నాన్ని సూచిస్తుంది. ఈ నియామకాలు దక్షిణ, తూర్పు రాష్ట్రాల వైపు మొగ్గ చూపుతున్న ధోరణిని సూచిస్తున్నాయి. కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాల నాయకులకు కీలక పదవులు లభించాయి.

## ప్రజల్లో 22ఎ గందరగోళం

**మొదటిపేజీ తరువాయి** కానీ ఆనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ తీసుకొచ్చి సీలింగ్ యాక్ట్ కింద 22ఎలో పెట్టడం ఏ రకమైన న్యాయం..ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇప్పుడు 22ఎలో పెట్టడం దుర్మార్గం. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ ఎ÷-లాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇప్పుడు ఎక్కడికి పోవాలని హరీశ్ రావు ప్రశ్నించారు. తమ ప్రాపర్టీ 22ంలో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియడం లేదు. తీరా రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, డబ్బులు చెల్లించిన తర్వాత.. చివర్లో మీ భూమి 22ఎ లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజల సొమ్మును నిలువునా దోచుకుంటోందని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఔక్షఅ వచ్చిన భూములకు బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. ఇప్పుడు అవే భూములను తీసుకొచ్చి 22ఎ లో పెట్టడంతో అటు ప్రజలు, ఇటు బ్యాంకులు ఇద్దరూ ఆగం అవుతున్నారు.

# పేదల ఆరోగ్యం మా బాధ్యత

**మొదటిపేజీ తరువాయి**

అనంతరం అక్కడ జరిగిన సభలో ఆరోగ్యదీపిక పాలిక్లినిక్‌లను ప్రారంభించారు. సురక్షితమైన ఆహారం, నాణ్యమైన మందులు అందించడమే లక్ష్యంగా టీసేఫ్ వ్యవస్థను ప్రారంభించారు. పలువురు డాక్టర్లను సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూడతెలంగాణ బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయనీ, ఆ భాషలను నేర్చుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. వైద్యం అత్యంత ఖరీదు కావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించాలనే లక్ష్యంతోనే సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్‌లను, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రులను కడుతున్నా మని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ కోసం రూ.2700 కోట్లు, సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు, మొత్తంగా ఆ రెండింటికీ రూ.5,226 కోట్లను ఖర్చుచేశామని వివరించారు. రెండేండ్లలో వైద్యారోగ్య శాఖ కోసం రూ.21,800 కోట్లు వెచ్చించామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనాలను కట్టించాలనే సోయి గత ప్రభుత్వానికి ఎందుకు లేకుండా పోయిందని ప్రశ్నించారు.టిమ్స్ ఆస్పత్రులకు, వరంగల్ దవాఖానాకు కేవలం టెంకాయలుకొట్టి వదిలేశారనీ, పదేండ్లలో వాటిని ఎందుకు కట్టలేదని అడిగారు. ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్‌లను, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రులను 2027 డిసెంబర్ తొమ్మిదో తేదీకల్లా పూర్తిచేసి ఒక్కో ఆస్పత్రికి ఒక్కో డైరెక్టర్‌ను నియమించి స్పెషాల్టీ వైద్యసేవలను అందజేస్తామనీ, వాటిని నిమ్స్ తరహాలో తీర్చిదిద్దుతామని హామీనిచ్చారు. అవన్నీ పూర్తయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరో పదివేల బెడ్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆస్పత్రికొచ్చే రోగుల సహాయకులు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. డాక్టర్ ఎమ్‌సీఆర్ టిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ పీజీ విద్య, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రుల్లో అదనంగా సమయం వెచ్చించి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలందించే, సర్జరీలు చేసే వైద్యులకు ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులను వేదిక నుంచే ఆదేశించారు. తాము సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభిస్తామని ప్రకటించగానే కొందరు పగటివేషగాళ్లలా తిరిగి పోయారనీ, ఇది తామే కట్టామని కేటీఆర్ చెప్పి పోయారని విమర్శించారు. వెనక ఉన్న ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రికి వెళ్లి మానసిక రోగిని టిమ్స్ కట్టిన తమను గుర్తుపపట్టల్లేదా? అని కేటీఆర్ అడిగితేడ"ఈడికొచ్చినప్పుడు చార్మినార్ నేనే గట్టిన. హైదరాబాద్‌ను నేనే నిర్మించిన అనుకునేటోన్ని. ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేటోన్ని. ఈడ డాక్టర్లు మంచిగ చూస్తరు. రానురాను పిచ్చి తగ్గిపోతది లే అన్నడంట" అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్



హౌసులు నిర్మించుకునేందుకు సమయం ఉందిగానీ ప్రభుత్వ ఆస్పత్రులను కట్టించి ప్రారంభించేందుకు పదేండ్లలో సమయమే దొరలేదా? అని ప్రశ్నించారు. అబద్ధాలు మానుకుని ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకోవాలనీ, నియోజకవర్గానికి పది నుంచి 20 కోట్ల రూపాయలు ఖర్చుచేసి ప్రజలకు సేవచేస్తే చేసిన పాపాలు కొంతైనా తగ్గుతాయని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. కేసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదనీ, ఇలా ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు. వాళ్లు అబద్ధాలు చెప్పడం మాననంత కాలం ప్రజలకు నిజాలు చెబుతూనే ఉంటానన్నారు. **బీఆర్ఎస్ నేతల ప్రచారం పచ్చి అబద్ధం : (డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూడతాము కట్టిన వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభిస్తోందని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధమని విమర్శించారు. సనత్‌నగర్ టిమ్స్ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చుచేసింది రూ.70 కోట్లు మాత్రమేననీ, ఆ డబ్బులతో అది ఎలా పూర్తవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతం కోసం తమ ప్రభుత్వం రెండున్నరేండ్లలో రూ.9 వేల దాకా ఖర్చుపెట్టిందనీ, ఆరు ప్రధాన ఆస్పత్రుల నిర్మాణాలపైనే రూ.3,800 ఖర్చుచేశామని గణాంకాలతో సహా వివరించారు. ఆరోగ్య శ్రీ పథకం కింద పేదలను రూ.10 లక్షల సహాయాన్ని అందిస్తున్నామనీ, ప్రతి నెలా ఆరోగ్య శ్రీ పథకం కిందనే రూ.100 కోట్లు విడుదల చేస్తున్నామని చెప్పారు.90 శాతం వైద్యసేవలు జిల్లాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లోనే అందేలా కృషి చేస్తున్నామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సనత్‌నగర్ టిమ్స్‌లో గుండె సంబంధ, అవయమార్పిడి, కిడ్నీడఎల్‌బీనగర్ టిమ్స్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ, పీడియాట్రిక్‌డఅల్వాల్ టిమ్స్‌లో న్యూరాలజీ, జెనిటిక్‌కు సంబంధించిన స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తామని మరోమారు చెప్పారు. టిమ్స్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునికమైన రేడియాలజీ విభాగం గురించి వివరించారు. రాబోయే పదేండ్లలో తలసేమియా రహిత తెలంగాణగా మార్చే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. మహిళా సంక్షేమం, వైద్యం, విద్య, సంక్షేమం ప్రభుత్వానికి నాలుగు పిల్లర్ల లాంటివనీ, వాటిపైనే దృష్టి పెట్టి తమ ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు.

ప్రతి టిమ్స్‌లో విదేశీ రోగులకు చికిత్సలు అందించేందుకు వంద పడకల చొప్పున ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**దసరాకల్లా అల్వాల్ టిమ్స్‌డిసెంబర్ నాటికి ఎల్‌బీనగర్ టిమ్స్ పూర్తిచేస్తాం : మంత్రి కోమటిరెడ్డి**

దసరానాటికల్లా అల్వాల్ టిమ్స్‌ను, డిసెంబర్ నాటికి ఎల్‌బీనగర్ టిమ్స్, వరంగల్ ఆస్పత్రుల నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎల్ఓసీలు, సీఎంఆర్ఎఫ్ నిధులను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నామని గణాంకాలతో వివరించారు. ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం 20 శాతం పూర్తయిందని తెలిపారు. ఎల్‌బీఆర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్‌బాపూజీ, అల్వాల్ ఆస్పత్రికి మాజీ సీఎం టి.అంజయ్య, వరంగల్ ఆస్పత్రి ప్రొఫెసర్ జయశంకర్ పేర్లను నామకరణం చేయాలని సీఎంకు సూచించారు.

**రోగుల సేవల్లో 70 శాతం నర్సులదే : మంత్రి పొన్నం**

తెలంగాణ కోసం కొట్లాడిన మర్రి చెన్నారెడ్డి పేరుమీద టిమ్స్ ఆస్పత్రిని ప్రారంభించడం ఆనందంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. డాక్టర్లు దేవుళ్లతో సమానమనీ, నర్సులు దైవదూతలని కొనియాడారు. రోగులకు వైద్య సేవలందించడంలో నర్సుల పాత్ర కీలకమనీ, డాక్టర్లు 30 శాతం సేవ చేస్తే 70 శాతం సేవ నర్సులదేనని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టియానా చోంగ్తూ, కమిషనర్ సంగీతా సత్యనారాయణ, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# 22ఎ భూములపై ఆందోళన వద్దు

**అధికారుల తప్పిదం వల్లనే ఇలా జరిగింది**
**అందుకు ప్రజలను క్షమాపణలు కోరుతున్నాం**
**నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తాం**
**టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి**
**ప్రజలను ఆఫీసులకు తిప్పే అధికారులపై చర్యలు తీసుకుంటాం**
**మీడియా సమావేశంలో రెవెన్యూమంత్రి పొంగులేటి వివరణ**




**హైదరాబాద్,ఆగస్ట్ 17,(ప్రజావినికిడి):**

ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాట్లాడుతూ..అధికారుల పొరపాటు వల్ల ఇలా జరిగిందన్నారు. 22ఏ భూములపై నాలుగు జిల్లాల్లోని అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగిందన్నారు. అధికారుల తరఫున క్షమాపణలు కోరుతున్నానని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి త్వరలోనే తొలగిస్తాం. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలన్నారు. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దని పొంగులేటి అన్నారు. 22ఎ వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. దీన్ని బూచిగా చూపి ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారంలో సత్వర కేసుల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెన్యూన్ కేసుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005- 994788కి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 511 అప్లికేషన్లు, రంగారెడ్డి జిల్లాలో 146 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్‌లో 49, సంగారెడ్డిలో 38 అప్లికేషన్లు వచ్చాయి. ప్రైవేటు భూమిని 22-ఎ కింద పెట్టారని 757 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవన్నీ 22-ఎ జాబితాలోకి ఎందుకు వచ్చాయనే అంశంపై చర్చించాం. ప్రైవేటు ఆస్తుల యజమానులను ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. గ్రౌండ్ రియాలిటీ ఎలా ఉందనే అంశంపై సమీక్షించాం. న్యాయంగా ఉన్నవాటిని త్వరలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం'.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదు. అధికారులకు అప్లికేషన్స్ ఇస్తే చాలని మంత్రి వివరించారు. న్యాయబద్ధమైన మీ ఆస్తులకు తొందరగా క్లియరెన్స్ అభిస్తుంది. ప్రజలు ఆందోళన చెందవద్దు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల తప్పిదాలను గుర్తించాం. కోర్టు ఆదేశాలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవడం వల్లే సమస్య ఏర్పడింది. అధికారుల తప్పిదాలను సవరణ చేస్తున్నాం. నిజమైన కేసులు త్వరలోనే పరిష్కారం అవుతాయని అన్నారు.

# కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ కొనసాగుతుంది

**మొదటిపేజీ తరువాయి**

ఒక పిటిషన్ హైకోర్టులో వేసిందన్నారు. అందులో భాగంగా ఈ పథకాన్ని ఆపాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలకు ఇవ్వడం జరిగింది. దీనిపై డివిజనల్ బెంచ్ కు అప్పీల్ కై వెళుతున్నాము. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం అని మంత్రి తెలిపారు. ఈ పథంలోని లొసుగులు ఏదైనా ఉంటే అది గత ప్రభుత్వం 2014లో చేసిన పొరపాటు వల్ల తలెత్తినది. అప్పుడు సరైన రీతులో ఉత్తర్వులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. తమ ప్రభుత్వం త్వరలో గత ప్రభుత్వం చేసిన అన్ని తప్పిదాలను సరిచేసి ఈ పథకం కొనసాగేలా చేస్తామన్నారు. గత ప్రభుత్వం పథకం లోప భూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ఇలా అయిందన్నారు. కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదా ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే వారి లోపమా అని విచారణ చేస్తున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ ప్రజలకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లు పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలని అన్నారు. పేదింటి ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ పథకాలను గత ప్రభుత్వం ప్రారంభించింది. రాజకీయాలకు అతీతంగా పేదల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుంది. రాజకీయ పిటిషన్లు పై ఈ పథకం ఎందుకు కొనసాగిస్తున్నారు అని స్టే ఇచ్చింది.. పథకాన్ని ఎత్తివేయలేదు..ఇది గత ప్రభుత్వ పథకం దీనిని ఎత్తివేయాలని మేము ఆలోచన చేయలేదు. గతంలో నిధులు కేటాయింపులకు సంబంధించిన ఇబ్బంది ఉన్న మేము వచ్చిన తర్వాత గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేసాం. వాళ్లు చేసిన అప్పులు.. దానిని తొలగించడానికి నిధుల సకాలంలో విడుదల చేయడానికి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు.. పేద ల పిల్లల వివాహాలకు సామాజికంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం బాసటగా ఉండాలని ప్రభుత్వం భావిస్తుంది. 12 తారీకు స్టే విధించింది.. వచ్చే నెల 9 వరకు అవకాశం ఉన్నప్పటికీ అప్పటి వరకు వెయిట్ చేయకుండా కోర్టులో స్టే తొలగించడానికి ముందుకు పోయాం.. రోడ్ల మీద నిరసనలు చేస్తున్న నాయకులకు చెప్తున్న మీరు చేసిన జీవోల వల్లే పథకానికి ఈ పరిస్థితి వచ్చింది. అయినా మేము కొనసాగిస్తున్నాం అన్నారు. బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, పీసీసీ,మంత్రులు ,ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు , ఎంపీలు, ప్రజా ప్రతినిధులు ,బలహీన వర్గాల నాయకులు ,కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొన్ననే ట్యాంక్ బండ్ పక్కన సామాజిక ఉద్యమ నాయకుడు మహాత్మా జ్యోతిబాపూలే సావిత్రి బాయ్ పూలే విగ్రహావిష్కరణ చేసుకున్నామని మంత్రి వివరించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
మంగళవారం18 ఆగస్టు 2026

# ప్రతి అక్షరం ఓ మహేంద్రజాలమే..

**నాడు సమాజ సేవకుడిగా..**
**నేడు సాహితీ సేవకుడిగా..**
**బహుముఖ ప్రజ్ఞాశాలి చెంది మహేందర్ రెడ్డి..**
**జర్నలిస్ట్ కేపీ ప్రశంస..**
**జర్నలిస్ట్ కేపీకి పుస్తకాన్ని, మెమెంటోను అందించిన చెంది మహేందర్ రెడ్డి..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** తాను చెప్పాలనుకున్న విషయాన్ని అతి సున్నితమైన మాటల్లో అందరికీ అర్థమయ్యేలా చెపుతూనే తన అక్షరం మహేంద్రజాలంతో సమాజానికి సందేశాన్ని అందించాలని జర్నలిస్ట్ కేపీ సీనియర్ న్యాయవాది చెంది మహేందర్ రెడ్డిని కొనియాడారు. సమాజానికి సందేశాన్ని అందించే దిశగా సీనియర్ న్యాయవాది చెంది మహేందర్ రెడ్డి రచించిన నాడు-నేడు పుస్తకాన్ని, మెమెంటోను సోమవారం జర్నలిస్ట్ కేపీ ఇంటికి వెళ్లి ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం జర్నలిస్ట్ కేపీ కూడా చెంది మహేందర్ రెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టు కేపీ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కర సేవకుడిగా, బిజెపి నాయకుడిగా, సీనియర్ న్యాయవాదిగా గుర్తింపును సాధించడమే కాకుండా వివిధ సేవా కార్యక్రమాల ద్వారా చెంది తనదైన ముద్ర వేశారని ప్రశంసించారు. ఇప్పుడు ఆయన సాహితీ రంగంలో కూడా అడుగుపెట్టి మహేంద్ర శ్రీ పేరిట సందేశాత్మక కవితలను జనంలోకి తీసుకువెళ్లడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన ఇలాంటి మంచి సాహిత్యాన్ని జనం కోసం అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అక్షర చైతన్యం సమాజంలో ఎంతో మార్పు తెస్తుందని, అలాంటి మార్పు తీసుకువచ్చేందుకు ఇలాంటి సాహితీవేత్తల అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నాడు- నేడు పుస్తకంలో ప్రతి అక్షరం ఒక ఆణిముత్యం అని అభినందించారు. భవిష్యత్తులోనూ ఆయన నుంచి మంచి పుస్తకాలను ఆశిస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, పథకాలు కొనసాగించాలి

**బిఆర్ఎస్,పార్టీ వాజేడు మండల అధ్యక్షులు, పెనుమల్ల. రామకృష్ణారెడ్డి..**







**వాజేడు,ఆగష్టు 18,(ప్రజావినికిడి):** పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి హార్దిక భరోసాకు ప్రతీకగా నిలిపిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి అని వాజేడు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెనుమల్ల రామకృష్ణారెడ్డి అధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు దరించి ప్లా కార్డులతో మండల కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమంలో మెమోరాండం ఇచ్చారు ఈ సందర్బంగా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ పథకాలను. 2014,లో ప్రారంభించినారు సుమారు 13 లక్షల పేదింటి ఆడపిల్లల పెళ్లిలకు 13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందించారు కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూడా పేద ఇంటి ఆడపిల్లలకు ఈ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు కొనసాగించారు కానీ ఈ మోసపూరిత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఈ పథకానికి లక్ష, నూట పదహార్ల తో పాటు తులం బంగారం ఇస్తాము అంటూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఒక్క పేదవారిని మోసం చేసి ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాల్లో ఏ ఒక్క పేదింటి ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వలేదు హైకోర్టు తీర్పు షాకుతో ఈరోజు ఈ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు రద్దు చేసే దురుద్దేశంతో ఈ కాంగ్రెస్ పార్టీ హైకోర్టులో కౌంటర్ వేయకుండా కాంగ్రెస్ పార్టీ ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా రద్దు చేయాలని ప్రయత్నం చేస్తుంది ఈ పథకాలను రద్దు చేసే ఆలోచన ఈ ప్రభుత్వం విరమించుకోకపోతే పేదింటి ఆడబిడ్డల తరపున బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళన చేపట్టి పేదింటి ఆడబిడ్డల కుటుంబాలకు అండగా ఉంటామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నుగూరు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుచ్చయ్య బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు కొత్తగట్టు రామమూర్తి మండల యూత్ అధ్యక్ష కార్యదర్శులు ముడిగ తిరుపతి బొల్లె ఆదినారాయణ ఉప సర్పంచ్ కల్లూరి సతీష్ మండల నాయకులు షేక్ నిజాముద్దీన్ తోట నరసింహులు పెన్నం సాంబశివరావు బొల్లె కేసు పెనుమల్ల వెంకట్రెడ్డి చిరుమర్తి శ్రీనివాస్ గౌరబోయిన శ్రీకాంత్ ప్రశాంత్ గార రవి నవీన్ నానాజీ నాగేంద్రబాబు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు

# రోలర్ & ఇన్‌లైన్ హాకీ 2వ ఇండిపెండెన్స్ కప్-2026 ఘనంగా ముగింపు.

**స్కేటర్ల అఫిలియేషన్ సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటా: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..**




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురం ఏ టైప్ క్వార్టర్స్ దగ్గర వనస్థలి స్కేటింగ్ రింక్ (చెఫ్ క్వెస్ట్) వేదికగా నిర్వహించిన రోలర్ & ఇన్‌లైన్ హాకీ 2వ ఇండిపెండెన్స్ కప్-2026 క్రీడా స్ఫూర్తితో అత్యంత వైభవంగా ముగిసింది.

ఈ ముగింపు కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రాజగోపాల్,సంయుక్త కార్యదర్శి శ్రీ జి.అజయ్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, స్కేటర్ల క్రమశిక్షణ,క్రీడా స్ఫూర్తిని అభినందించారు. అలాగే స్కేటర్లు,తల్లిదండ్రుల చిరకాల కోరిక అయిన టి.ఆర్.ఎస్.ఎ అఫిలియేషన్ సమస్య పరిష్కారానికి తాను వ్యక్తిగతంగా చొరవ తీసుకుని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ శ్రీ సోనీ బాల దేవి ని కలిసి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సాంకేతిక కమిటీ చైర్మన్ సత్య,ఉపాధ్యక్షులు శ్రీ అబ్దుల్ ఖురేషి,వట్టి శ్రీను,ముస్తఫా, అహ్మద్, అఫీజ్,సిద్దిక్, కోమల్,ఆకాష్ సేవలను నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీ సాయి (రాజు),వంశీ కృషిని కొనియాడారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేసిన స్కేటర్లు,తల్లిదండ్రులు,కోచ్‌లు, తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధికారులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టంగుటూరి నాగరాజు చైర్మన్,నిర్వహణ కమిటీ తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ తదితరులు పాల్గొన్నారు.

# దూసకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడలపై అవగాహనా

**శ్వేత యాదవ్ రిపోర్టర్ (బీపీఈడి విద్యార్థి)**
**తెలంగాణ రాష్ట్ర లగోరి కోచ్ విశాల్ సచిన్**
**లాగిరో క్రీడా అభివృద్ధి మా లక్ష్యం**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):** దూసకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడలపై విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి,వారికి మండల,రాష్ట్ర స్థాయిలో మంచి అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్వేత యాదవ్ రిపోర్టర్ ముందుకు వచ్చి తన,పట్టుదలతో తెలంగాణ క్రీడా కబడ్డీ కోచ్ ద్వారా విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులతో,విద్యార్థులతో మాట్లాడి,క్రీడల్లో ప్రతిభ కనబరిచే వారికి మండల స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాలు, తద్వారా రాష్ట్ర స్థాయికి ఎదిగే మార్గాలను తెలిపారు క్రీడలపై ఆసక్తి ఉన్న ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా శ్రద్ధ పెంచుకోవాలని, తమలోని ప్రతిభను గుర్తించి ముందుకు సాగాలని శ్వేతయాదవ్ సూచించారు. విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తూ,వారి ప్రతిభకు తగిన వేదిక కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్వేత యాదవ్‌కు , వర్షిత్,తెలంగాణ లగోరి కోచ్,పి.కిరణ్ తెలంగాణ లగోరి కోచ్,సచిన్ తెలంగాణ లగరి కోచ్ కు కృతజ్ఞతలు తెలిపారు. మీ లాంటి వారు ముందుకు వచ్చి విద్యార్థులను ప్రోత్సహిస్తే, దూసకల్ పాఠశాలల్లో విద్యార్థులకు మరిన్ని మంచి అవకాశాలు అవసరపడుతాయని ఉపాధ్యాయులు కోరారు. విద్యార్థుల భవిష్యత్తు మంచి కోసం శ్వేత యాదవ్ చేస్తున్న కృషిని ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందించారు.




# డీక్లాసిఫైడ్ ఆపరేషన్ సింధూర్ డిస్కవరీ ప్లస్ లో ప్రసారం..



**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, డిస్కవరీ ఛానల్ 'డీక్లాసిఫైడ్ ఆపరేషన్ సింధూర్'ద్వారా భారతదేశపు సీనియర్ సైనిక, జాతీయ భద్రతా నాయకత్వం, ఆపరేషనల్ కమాండర్లు, ఫ్రంట్‌లైన్ సిబ్బందితో అపూ ర్వమైన సంభాషణలను అందుబాటులోకి తెచ్చింది. వాస్తవ ప్రపంచంలోని కీలక కథలలోకి ప్రేక్షకులను మరింత లోతుగా తీసుకువెళ్లే ఈ ఛానల్ వారసత్వాన్ని కొనసాగిస్తూ,ఈ డాక్యుసిరీస్ ఆ ఆపరేషన్‌కు నాయకత్వం వహించిన వారి ద్వారా, అందులోని కీలక ఘట్టాలు ఎలా రూపుదిద్దుకున్నాయో,ఎలా ఆవిష్కృతమయ్యాయో వెల్లడిస్తుంది. 2026 ఆగస్టు 15న డిస్కవరీలో ప్రీమియర్ అయిన తర్వాత, ఈ రెండు భాగాల డాక్యుసిరీస్ డిస్కవరీ ప్లస్ లో సైతం ప్రసారమవుతుందనీ పేర్కొంది

ఆపరేషన్ సింధూర్ తర్వాత ఇచ్చిన తన మొదటి ఇంటర్వ్యూలో, భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఈ డాక్యుమెంటరీ సిరీస్‌లో ఇలా అన్నారు. శత్రువుల స్థావరాలను, ముఖ్యంగా పహల్గామ్ దాడికి బా ధ్యులైన వారి స్థావ రాలను ధ్వంసం చేయడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని మేం నిర్ణయించుకున్నాం అని అన్నారు. ప్రపంచానికి తమ సందేశం చాలా స్పష్టం భారతదేశ ఉదారతను లేదా సహనశీలతను బలహీనతగా భావించకూడదన్నారు. పరిణామాలు ఏవైనప్పటికీ, భారతదేశం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోగలదు, గట్టిగా ఎదురుదాడి చేయ గలదు అని ఆయన అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం ప్రారంభమయ్యే మొదటి భాగం, సాయుధ దళాలు,నిఘా బృందాలు ఎలా రంగం లోకి దిగి, నిఘా సమాచారాన్ని సేకరించి, పర్యవేక్షణ చేపట్టి, ఆపరేషన్‌కు సిద్ధమయ్యాయో వివరిస్తుందన్నారు.

## తల్లిదండ్రుల నెలవారీ మందులు సమకూర్చడంలో
# సాయపడుతున్న ప్లాటినమ్‌ఆర్ ఎక్స్

**మందుల ఖర్చులపై 60 శాతంవరకు ఆదా**

PlatinumRx

**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):** వివిధ నగరాల్లో ఉండే యువ వృత్తి నిపుణల తల్లిదండ్రుల పునరావృతమయ్యే మందుల అవసరాలు తీర్చడంలో సాయపడుతూ, నెలవారీ ఆరోగ్య సంరక్షణ ఖర్చులను 60 శాతం వరకు తగ్గిస్తోంది సరసమైన దీర్ఘకాలిక ఔషధాల ప్లాట్‌ఫామ్ ప్లాటినమ్‌ఆర్‌ఎక్స్ పేర్కొంది. డాక్టర్లు సూచించిన ఔషధాలతో పాటు అదే కూర్పు, నాణ్యతతో కూడిన అందుబాటు ధరలో ఉండే ప్రత్యామ్నాయలను వినియోగదారులు కనుగొని వాటిని నేరుగా తమ తల్లిదండ్రుల ఉండే చోటుకు ఈ వేదిక ద్వారా పంపించవచ్చనీ వెల్లడించింది. డయాబెటీస్, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్,గుండె జబ్బులు వంటి సమస్యలకు సంబంధించిన ఔషధాలను భౌతికంగా వారి దగ్గర లేకుండానే సమకూర్చడంలో వెసులుబాటు కల్పిస్తుందనీ పేర్కొంది. పది లక్షలకు పైగా వినియోగదారులకు ఔషధాలపై రూ. 137 కోట్లకు పైగా ఆదా చేయడంలో ప్లాటినమ్ ఆర్ఎక్స్ సాయపడిందనీ తెలిపింది. ప్రస్తుతం భారతదేశంలో 19,000కు పైగా పిన్ కోడ్‌లలో డెలివరీ సేవలు అందిస్తోందనీ బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లోని వినియోగదారులు తమ సొంత ఊళ్లలో నివసిస్తున్న తల్లిదండ్రుల కోసం మందులు ఆర్డర్ చేయడానికి ఇది వీలు కల్పిస్తుందనీ పేర్కొంది.

## డైమండ్ బ్రోచెస్ కలెక్షన్ ను ఆవిష్కరించిన
# లైమ్‌లైట్ ల్యాబ్ గ్రోన్ డైమండ్స్



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** ఐఎంఏ హైదరాబాద్ 87వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో తన పవర్ మార్క్ తో ప్రత్యేకంగా నిలిచిన లైమ్ లైట్ ల్యాబ్ గ్రోన్ డైమండ్స్

భారతదేశంలోనే అతిపెద్ద ల్యాబ్ గ్రోన్ డైమండ్ జ్యువెలరీ బ్రాండ్ అయినటువంటి లైమ్‌లైట్ ల్యాబ్ గ్రోన్ డైమండ్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హైదరాబాద్ సిటీ బ్రాంచ్ 87వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో 'పవర్‌మార్క్' అనే తన ప్రత్యేకమైన డైమండ్ బ్రోచెస్ కలెక్షన్ ను ఆవిష్కరించింది. డాక్టర్లు,చార్టర్డ్ అకౌంటెంట్లు, లాయర్లతో సహా పలు వృత్తి నిపుణుల అంకితభావం మరియు విజయాలను చాటిచెప్పడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా లైమ్‌లైట్ ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ వ్యవస్థాపకురాలు మేనేజింగ్ డైరెక్టర్ పూజా మాధవన్ మాట్లాడుతూ, తమ ఎంతో గౌరవించే వృత్తుల వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు పవర్ మార్క్ ను ఒక మార్గంగా భావిస్తున్నామన్నారు. ఒక వృత్తిపరమైన హోదా అనేది సంవత్సరాల తరబడి క్రమశిక్షణ, అభ్యాసం, త్యాగం సేవకు ప్రతీక. ఆ గర్వాన్ని వ్యక్తులు ధరించేలా మేము ఒక గుర్తింపును సృష్టించాలనుకున్నామనీ పేర్కొన్నారు. వైద్య సమాజాన్ని సమాజానికి వైద్యులు అందించే అపారమైన సేవను గౌరవిస్తూ తము ఈ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నందున,ఐఎంఏ హైదరాబాద్ సిటీ బ్రాంచ్ వ్యవస్థాపక దినోత్సవం నాడు పవర్ మార్క్ ను ప్రారంభించడం తమకు ఎంతో ప్రత్యేకమైనది

# పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష



**నాగోల్,(ప్రజావినికిడి):**
పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష,రూ.3 వేల జరిమానా విధిస్తూ ఎల్బీనగర్ లోని రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 405/2025, బీఎన్ఎస్ సెక్షన్ 78,పోక్సో చట్టంలోని సెక్షన్ 11 రెడ్ విత్ 12 కేసులో నిందితుడు ఉప్పు రాకేష్ (24)ను కోర్టు దోషిగా నిర్ధారించింది. నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3,000 జరిమానా విధించింది. బాధితురాలికి రూ.50,000 పరిహారం అందించాలని ఆదేశించింది.ఈ కేసులో నాగోల్ ఎస్ఐ పి. శివ నాగ ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. అదనపు పీపీలు శోభారాణి,పి. సత్యనారాయణ ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. కేసు విచారణలో నాగోల్ పోలీస్‌స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ రాజు,సమన్స్ కానిస్టేబుల్ వెంకటేష్, ఏఎస్పైపి.శోభ సహకరించారు.

# స్త్రీ నిధి అసిస్టెంట్ మేనేజర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

## మూడు సంపత్ కుమార్ డిమాండ్




**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):**
రాష్ట్ర పంచాయత్ రాజ్,గ్రామీణ అభివృద్ధి శాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళల స్వయం సహాయక బృందాలకు ఆర్థిక సహాయం అందించే స్త్రీ నిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ వ్యవస్థలో పూర్తి స్థాయిలో పనిచేస్తున్న అసిస్టెంట్ మేనేజర్లు (ఫీల్డ్ ఆపరేషన్స్)లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని స్త్రీ నిధి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మూడు సంపత్ కుమార్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్ లో సోమవారం స్త్రీ నిధి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమ్మేళనం జరిగింది.ఈ సందర్భంగా మూడు సంపత్ కుమార్ మాట్లాడుతూ, ఉన్నత విద్యను అభ్యసించి, ఉద్యోగాలు దొరకక,కుటుంబ పోషణకై దిక్కులేని పరిస్థితులలో ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా తక్కువ జీతంతో పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విస్తృతమైన భౌగోళిక ప్రాంతాల్లో పర్యటించడం, రికవరీ యాప్‌ల నిర్వహణపై మహిళలకు అవగాహన కల్పించడం నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాల్సి రావడం, మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాలను వంద శాతం వసూలు చేయాలనే ఉన్నతాధికారుల తీవ్ర ఒత్తిడితో సతమతమైతున్నామని తెలిపారు. కేవలం ఒప్పంద ప్రాతిపదికన పూర్తి స్థాయిలో పనిచేస్తున్నా స్త్రీ నిధి అసిస్టెంట్ మేనేజర్లుకు ప్రమోషన్లు, జీతభత్యాల పెంపు లేకపోవడం, క్రమబద్ధీకరణ లేకపోవడంతో భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి జీతభత్యాలు పెంచి, క్రమబద్ధీకరించాలని మూడు సంపత్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ సభలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈ సురేష్, వైస్ ప్రెసిడెంట్ రజిత, ఈసీ సభ్యులు దీప,సుభాష్, రజిత,ప్రవీణ్ రెడ్డి,శ్రీనివాస్ పాల్ రంజిత్ యాసిన్ గౌతమి, సైదేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మేనకోడలు వివాహానికి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆహ్వానం



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఈ నెల 27వ తేదీన జరగనున్న తమ మేనకోడలు రాణి-శివకుమార్ వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ప్రముఖులను ఆహ్వానించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ని కలిసి వివాహ ఆహ్వాన శుభలేఖను అందజేశారు.అదేవిధంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో పాటు ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ ఠాకూర్, మనోహర్ రెడ్డి,విజయ రమణ రావు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మధుసూదన్ రెడ్డి,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి,తదితరులను కలిసి వివాహ ఆహ్వాన శుభలేఖలను అందజేశారు.వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులు రాణి, శివకుమార్‌లను ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారిని సాదరంగా ఆహ్వానించారు.

# గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఎస్ఎఫ్‌సి నిధులను విడుదల చేయాలి



**ఆబిడ్స్, (ప్రజావినికిడి):**
గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్ఎఫ్‌సి) నిధులను ప్రతి నెలా క్రమం తప్పకుండా విడుదల చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ కమిటీ సమావేశం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హాజరై నూతనంగా జిల్లా సర్పంచుల సంఘం జేఏసీ 2026లో బాధ్యతలు చేపడుతున్న సర్పంచులను జిల్లా అధ్యక్షులుగా నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ను తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ గౌరవాధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు సకాలంలో అందితేనే సర్పంచులు ప్రజలకు మెరుగైన సేవలు అందించగలగుతారని కొనియాడారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు,పెండింగ్ బిల్లులు సకాలంలో విడుదల చేసి పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని కోరారు.అలాగే పెండింగ్ బిల్లులు కూడా సకాలంలో విడుదల చేసి పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం పాడుపడాలని అభిలాషించారు. కార్యక్రమంలో తెలంగాణ స్థానిక సంస్థల సాధికారత సంఘం కో ఆర్డినేటర్ వి.వి.రావు, స్థానిక సంస్థల విశ్లేషకులు బండారు రామ్మోహన్, తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి,కార్యదర్శి కేశబోయిన మల్లయ్య, అరవింద్ రెడ్డి నూతనంగా నియమితులైన జిల్లా అధ్యక్షులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ఏటూరు నాగారం ఐటీడీఏ ముట్టడితో దద్దరిల్లిన ఏజెన్సీ

### 2 వేల మందితో భారీ ర్యాలీ.. హక్కుల కోసం రోడ్డెక్కిన ఆదివాసీలు

### జీవో-3 పునరుద్ధరించాలి..1/70 అమలు చేయాలి..పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి.. తుడుం దెబ్బ డిమాండ్..






**వాజేడు,ఆగష్టు 18,(ప్రజావినికిడి):**
ఏటూరునాగారంఆదివాసీల హక్కుల కోసం ఏజెన్సీ గడ్డ మరోసారి గర్జించింది. భూమి,అడవి, ఉపాధి,విద్య, ఉద్యోగాలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఏటూరునాగారం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమం విజయవంతమైంది.వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఏజెన్సీ ప్రాంతంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 2 వేల మంది ఆదివాసీలు, యువత, మహిళలు, వివిధ ఆదివాసీ సంఘాల ప్రతినిధులు భారీగా తరలివచ్చారు. వై జంక్షన్ నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీ ఆదివాసీ జెండాలు, ప్లకార్డులు, నినాదాలతో ఏటూరునాగారం వీధులను హోరెత్తించింది. "జై ఆదివాసీ" జల్-జంగల్-జమీన్ జీవో3 పునరుద్ధరించాలి1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి అంటూ చేసిన నినాదాలతో ఏజెన్సీ ప్రాంతం మార్మోగింది. ర్యాలీ అనంతరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట సుమారు గంటపాటు భారీ ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి తమ డిమాండ్లను స్పష్టంగా వినిపించారు.

**హక్కులు అడగడం కాదు.. రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాలని డిమాండ్**

ధర్నాలో తుడుం దెబ్బ జాతీయ, రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ, ఆదివాసీలు ఎవరి దయాదాక్షిణ్యాల కోసం ఎదురుచూడటం లేదని, రాజ్యాంగం మరియు చట్టాలు కల్పించిన హక్కులను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని మాత్రమే కోరుతున్నామని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాల్సిన 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, అక్రమంగా అన్యాక్రాంతమైన ఆదివాసీ భూములను గుర్తించి తిరిగి ఆదివాసీలకు అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జీవో నంబర్-3ను వెంటనే పునరుద్ధరించాలని,ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలకు ఉద్యోగ,ఉపాధి అవకాశాల్లో న్యాయం చేయాలని కోరారు.స్థానిక ఆదివాసీ యువత నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఐటీడీఏ పరిధిలోని ఉద్యోగ అవకాశాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**8 లక్షలఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి**

తరతరాలుగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూముల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. సుమారు 8 లక్షల ఎకరాల పోడు సాగుభూములకు అర్హులైన ఆదివాసీలకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరారు. ఆదివాసీల భూములను అక్రమంగా ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భూమి హక్కుల విషయంలో ఆదివాసీలకు పూర్తి రక్షణ కల్పించాలని అన్నారు.భూమి మా జీవనాధారం.. అడవి మా ఊపిరి.. హక్కులు మా భవిష్యత్తు అని నినదించారు.

**ఉద్యోగాల్లో స్థానిక ఆదివాసీ యువతకు న్యాయం చేయాలి**

ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉద్యోగ అవకాశాలను స్థానిక ఆదివాసీ యువతకు ప్రాధాన్యతనిస్తూ భర్తీ చేయాలని తుడుం దెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు జీవో నంబర్-109 ప్రకారం 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఐటీడీఏలను కేవలం కార్యాలయాలుగా కాకుండా ఆదివాసీ అభివృద్ధికి ప్రధాన కేంద్రాలుగా మార్చాలని, విద్య,వైద్యం, ఉపాధి, వ్యవసాయం, మౌలిక వసతులు, స్వయం ఉపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.అర్హత ఉన్న వలస ఆదివాసీలకు నిబంధనల ప్రకారం ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని, ఆదివాసీ హక్కులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని కోరారు.

**లంబాడీల అంశంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి**

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్‌పై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తుడుం దెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీల రిజర్వేషన్లు, రాజ్యాంగ హక్కులు, ఏజెన్సీ ప్రాంతాల ప్రత్యేక రక్షణ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని కోరారు.

**ఇది ముగింపు కాదు.. పోరాటానికి నాంది**

తుడుం దెబ్బ నాయకులు స్పష్టం చేస్తూ, ఏటూరునాగారం ఐటీడీఏ ముట్టడి ఒక్కరోజు కార్యక్రమంతో ముగిసే పోరాటం కాదని అన్నారు. ఆదివాసీల భూమి,అడవి, హక్కులు, ఉద్యోగాలు, ఉపాధి,విద్య, భవిష్యత్తు కోసం ఈ ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తామని ప్రకటించారు. చట్టాలు కాగితాలకే పరిమితం కాకుండా ఏజెన్సీ గడ్డపై అమలయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని,ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం నాయకులు తమ ప్రధాన డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి సమర్పించారు. ఆదివాసీల సమస్యలపై ప్రభుత్వం,జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు.ఈ పోరాటం ఒక్క నాయకుడి కోసం కాదు.ఒక్క సంఘం కోసం కాదు.ప్రతి ఆదివాసీ కుటుంబం భవిష్యత్తు కోసం. హక్కులు సాధించే వరకు అడుగు వెనక్కి వేయం.. పోరాటం ఆపం అని తుడుం దెబ్బ నాయకులు స్పష్టం చేశారు.

**జాతీయ,రాష్ట్ర నాయకుల భారీ సమీకరణ**

ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షులు వట్టం ఉపేందర్, జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు యాసం రాజు, రాష్ట్ర అధ్యక్షులు గొండెం గణేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్,రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కొమురం లక్ష్మీకాంత, తెలంగాణ రాష్ట్ర భూమిపుత్ర సంఘం పూనెం రామచందర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

**ఏజెన్సీ గడ్డ నుంచి ప్రభుత్వానికి స్పష్టమైన సందేశం**

ఆదివాసీ హక్కులను నిర్లక్ష్యం చేయవద్దు.. చట్టాలను అమలు చేయండి.. భూమికి హక్కు ఇవ్వండి.. యువతకు ఉద్యోగం ఇవ్వండి..ఏజెన్సీ ప్రాంతానికి న్యాయం చేయండి అంటూ ఏటూరునాగారం ఐటీడీఏ ముట్టడి ద్వారా ఆదివాసీలు ప్రభుత్వానికి బలమైన సందేశాన్ని ఇచ్చారు.జల్‌జంగల్‌జమీన్ కోసం పోరాటం కొనసాగుతుంది.. ఆదివాసీ హక్కులు సాధించే వరకు ఉద్యమం ఆగదు"అని తుడుం దెబ్బ నాయకులు తేల్చిచెప్పారు.

# తులం బంగారం దేవుడెరుగు.. కనీసం పేదింటి ఆడపిల్ల కళ్యాణ లక్ష్మి షాదీ-ముబారక్ అడ్డుపడకండి..

### షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ డిమాండ్..





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పేదింటి ఆడపడుచుల కళ్యాణానికి తులం బంగారం ఇస్తామని ప్రగల్బాలు పలికిన ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు ఏకంగా కళ్యాణ లక్ష్మి,షాధీ ముబారక్ లకే ఎసరు పెడుతున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ విమర్శలు గుప్పించారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు స్టే విధించడం దీనినీ ఎత్తివేయకుండా ప్రభుత్వం సంసిద్ధంగా లేకపోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆర్డిఓ కార్యాలయం ఎదుట భారత రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ శ్రేణులు ధర్నాకు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ధర్నాను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మీడియాతో మాట్లాడుతూ,నూరు అబద్ధాలైన ఆడి ఒక పెళ్లి చేయాలని నాటి పెద్దలు అనేవారు.ఆనాడు పెద్దలు నానుడి అంటూ ఉండేవారని పేద ఇంటి ఆడపిల్లలకు పెళ్లి చేయడానికి కన్న తల్లిదండ్రులు పడుతున్న తాపత్రయం ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని 2014లో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 51 వేల రూపాయల పారితోషకంతో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి బృహత్తరమైన పథకాలను ప్రవేశపెట్టారని,అలాగే పేదల అవసరాలకు అనుగుణంగా వారి ఇబ్బందులు గుర్తించి వాటిని లక్ష రూపాయలకు పైగా కేటాయించారని గుర్తు చేశారు. కళ్యాణ లక్ష్మి పై ఎవరో హైకోర్టులో రెడ్ పిటిషన్ వేగా కోర్టు ఐదు సందర్భాలలో ప్రభుత్వాన్ని సంజయిషీ కూరగా ప్రభుత్వ లీడర్ ఎవరు తగువిధంగా స్పందించలేదని అంజయ్య యాదవ్ ఆరోపించారు.ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పేద ప్రజల కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను ఎతివేసేందుకు కుట్ర చేస్తుందని అందుకే ఉన్నత న్యాయస్థానానికి సమాధానం చెప్పుకోలేకపోయిందని అందుకే ఈ పథకాలపై స్టే విధించడం జరిగిందని అంజయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ఎన్నో ప్రగల్బాలు పలికారని రెండున్నర సంవత్సరాలు ప్రభుత్వం వచ్చి పాలన కొనసాగుతున్న తులం బంగారం ఇవ్వకపోగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి బృహత్తర పథకాలను ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి పథకాలు సామాజిక అంశంతో ముడిపెట్టి చూడాలని అంజయ్య యాదవ్ ప్రభుత్వానికి అప్పీల్ చేశారు. ఎందుకంటే పేద కుటుంబాల్లో ఆడపిల్లలు కన్న తల్లిదండ్రులకు భారం అని భావించి ఆడపిల్లలను అంగట్లో అమ్మివేస్తున్నారని చదువులు చదివిపించడం లేదని ఇలాంటి సమయంలో ఆడపిల్ల పుట్టగానే కెసిఆర్ ప్రభుత్వం ఆనాడు కెసిఆర్ కిట్ ద్వారా 13 వేల రూపాయలు ఇస్తుందని ఆ తర్వాత విద్య తదితర పథకాలలో ప్రాధాన్యత ఇస్తుందని పెళ్లి చేసి పంపే వరకు కళ్యాణ లక్ష్మి అందజేస్తుందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య గుర్తు చేశారు.ఆడపిల్ల కోసం గత ప్రభుత్వం ఎంతో తాపత్రయపడి వారి భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని అనేక పథకాలు రూపొందించింది అని గుర్తు చేశారు.ప్రభుత్వం కోర్టు అంశంలో వెంటనే స్పందించి విధంగా ప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రజలను చైతన్యవంతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుండి ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్,మాజీ మహిళ స్త్రీ శిశు సంక్షేమ రీజినల్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి,మాజీ ఎస్సి ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాల్ నాయక్,బీఆర్ఎస్ మండల,మున్సిపల్,గ్రామ అధ్యక్షులు,తాజా మాజీ కౌన్సిలర్లు,మాజీ కౌన్సిలర్ లు,మాజీప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ యువత,బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి

## పేద ఆడబిడ్డల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించొద్దు

### తులం బంగారం ఎక్కడ.? హామీ ఎప్పుడు అమలు చేస్తారు.? -బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్

**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** రాష్ట్రంలోని పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచిన కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఆర్థిక సహాయం విడుదల చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు.మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో గారిని కలిసి వినతిపత్రం అందజేశారు.





**కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పేదలకు అండ బీఆర్ఎస్ నేత రవీందర్ యాదవ్**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకాలు లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచాయి. ఇలాంటి పథకాలను నిలిపివేయడం పేద ఆడబిడ్డలకు అన్యాయం చేయడమే అన్నారు. హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం సకాలంలో కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదో,పేదల ప్రయోజనాలకు సంబంధించిన ఈ కీలక అంశంపై ప్రభుత్వం ఎందుకు సమర్థవంతంగా వాదించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఇప్పుడు హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ పథకాలను నిలిపివేయాలని చూడటం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చింది.ఆ హామీని అమలు చేయకపోగా,

ఉన్న కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకాలను కూడా నిలిపివేయడం పేద ప్రజలను మోసం చేయడమే. పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్హుడికి వెంటనే ఆర్థిక సహాయం విడుదల చేయాలి.తులం బంగారం హామీని ఎప్పుడు అమలు చేస్తారో ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలి అని రవీందర్ యాదవ్ అన్నారు.పేద ఆడబిడ్డల ప్రయోజనాలకు భంగం కలిగించే ఎలాంటి నిర్ణయాన్నైనా బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, అవసరమైతే ప్రజల తరఫున మరింత పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు,మహిళ నాయకురాలు,యువత, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏ.ఐ.వై.ఎఫ్ హైదరాబాద్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

## అధ్యక్షులుగా ఆర్.బాలకృష్ణ ,కార్యదర్శిగా షేక్ మహమూద్

**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):**

అఖిల భారత యువజన సమాఖ్య (ఏ.ఐ.వై.ఎఫ్) హైదరాబాద్ జిల్లా నూతన అధ్యక్షులుగా ఆర్.బాలకృష్ణ, కార్యదర్శిగా షేక్ మహమూద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏ.ఐ.వై.ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. వలి ఉల్లాహ్ ఖాద్రి ప్రకటించారు. హైదరాబాద్ హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్ లో



అధ్యక్షులు ఆర్.బాలకృష్ణ ,



కార్యదర్శి షేక్ మహమూద్

సోమవారం ఏ.ఐ.వై.ఎఫ్ హైదరాబాద్ జిల్లా 25వ మహాసభల రెండవ రోజు ప్రతినిధుల సభ జరిగింది.ఈ సభలో నూతన అధ్యక్షులుగా ఆర్.బాలకృష్ణ, కార్యదర్శిగా షేక్ మహమూద్ లతోపాటు ఉపాధ్యక్షులుగా కే.మహేష్, వి.భగత్ సింగ్,కే కళ్యాణ్,సహాయ కార్యదర్శులుగా మజీద్ అలీ ఖాన్,నాగరాజు, అనిల్ కుమార్, కోశాధికారిగా హేమంత్ లతోపాటు 25 మంది సభ్యులతో నూతన కౌన్సిల్ ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఆర్. బాలకృష్ణ,షేక్ మహమూద్ మాట్లాడుతూ, నిరుద్యోగ సమస్య, యువత ఎదుర్కుంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని, కేంద్ర బీజేపీ పాలనలో ధ్వంసం అవుతున్న రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని రక్షించుకోవడానికి బలమైన ఉద్యమాలు నిర్మిస్తామని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ఏ.ఐ.వై.ఎఫ్ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

# జీవో నెంబర్ (97)ను శక్తి పాలసీ వెనక్కి తీసుకోవాలి

**డిప్లొమా పాలిటెక్నిక్ విద్యను సివిల్ యూనివర్సిటీల్లో విలీనం చేయడం సరికాదు..**

**ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ సెక్రటరీ వడ్ల శ్రీకాంత్**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
తెలంగాణ ప్రభుత్వం డిప్లొమా,పాలిటెక్నిక్ విద్యను సివిల్ యూనివర్సిటీల్లో విలీనం చేసే ప్రతిపాదనను ప్రభుత్వం పునరాలో చించాలని ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ సెక్రటరీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు.ఈ నిర్ణయం అమలైతే పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేకమైన విద్యా విధానం,సాంకేతిక శిక్షణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన కోర్సులు ఉన్నాయని తెలిపారు.డిప్లొమా విద్యను ప్రత్యేక వ్యవస్థగా కొనసాగించడం వల్ల విద్యార్థులకు బీటెక్,ఎంటెక్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా అవకాశాలకు వెళ్లే మార్గాలు అందుబాటులో ఉంటాయని అన్నారు.ప్రభుత్వ పాలిటెక్నిక్




కళాశాలలు ముఖ్యంగా పేద, మధ్యతరగతి,గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని శ్రీకాంత్ పేర్కొన్నారు.ఈ విద్యాసంస్థలను ఇతర వ్యవస్థల్లో విలీనం చేయడం వల్ల ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులపై అదనపు భారం పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల ఉన్నత విద్యా అవకాశాలను కాపాడుతూ సాంకేతిక విద్యను మరింత బలోపేతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్, చరణ్,రాంచరణ్,




ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, బబ్లు,రాజేష్, రాకేష్,భాను వంశీ,విష్ణు వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# నందనవనం వాంబే కాలనీ లో ఘనంగా బోనాలు

**హస్తినాపురం డివిజన్ బి ఆర్ ఎస్ బీసీ సెల్ ఉప అధ్యక్షుడు కమ్మరి నారాయణ చారి**



**ఎల్బీనగర్, ఆగస్టు17,( ప్రజావినికిడి):**
నందనవనం వాంబే కాలనీలోని బోనాల పండు వేడుకలు అద్భుతంగా జరిగాయనీ హస్తినాపురం డివిజన్ బి ఆర్ ఎస్ బీసీ సెల్ ఉప అధ్యక్షుడు కమ్మరి నారాయణ చారి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నల్ల పోచమ్మ తల్లి అందరిని చల్లగా చూడాలని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి వేడుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో వాంబే కాలనీ యూత్ లీడర్, నల్ల పోచమ్మ ఆలయ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ మరియు వాంబే కాలనీ ప్రెసిడెంట్ సిహెచ్ విష్ణు శ్రీ పోచమ్మ గుడి జనరల్ సెక్రెటరీ బర్పటి వెంకన్న, రేణుక ఎల్లమ్మ ఆలయ అధ్యక్షులు ఎడ్ల శ్రీను,రేణుక ఎల్లమ్మ ఆలయ జనరల్ సెక్రెటరీ శివకృష్ణ, మరియు సంగిపేట్ నరేష్, శ్రీను,మహేందర్, సాయి కృష్ణ, నరేష్, అంజయ్య,డి. బాలయ్య, మణికాంత్, రాజు గౌడ్, సాయి తదితరులు ఈ వేడుకలలో పాల్గొని అమ్మవారి బోనాల పండుగ అద్భుతంగా కొనసాగించడం జరిగింది.

# కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ రద్దుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రను అడ్డుకోవాలి

## :ఎల్బీనగర్ నియోజకవర్గం బారాస పార్టీ మహిళలు..







**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
సోమవారం రోజు ఎల్బీనగర్ చౌరస్తా వద్ద ఎల్బీనగర్ నియోజకవర్గం మహిళ నాయకురాలు కాంగ్రెస్ ప్రభుత్వం పై విరుచుకుపడ్డారుదానిలో భాగంగా రోడ్డుమీద ధర్నా కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ, హైకోర్టు తీర్పు సాకుతో పేదింటి ఆడబిడ్డల భరోసాను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తుందన్నారు.

కళ్యాణ లక్ష్మి అంశంలో హైకోర్టులో కౌంటర్ వేయకుండా కాంగ్రెస్ కుట్ర చేసిందన్నారు.ముఖ్యమంత్రి,మంత్రుల అవినీతి అంశాల్లో కోట్ల రూపాయలు చెల్లించి ప్రైవేటు లాయర్లను పెట్టుకునే ప్రభుత్వం ఈ అంశంలో ఎందుకు కౌంటర్ వెయ్యలేదని అన్నారు.

తెలంగాణ ఆడబిడ్డలు,వారి కుటుంబాల తరఫున బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీని నిలదీస్తుంది అని అన్నారు.ఆడబిడ్డల తులం బంగారం అడుగుతున్నందుకే పూర్తిగా కళ్యాణ లక్ష్మిని ఎత్తగొట్టే కుట్ర చేస్తుంది అని అన్నారు.పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి,ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన కల్యాణలక్ష్మి,

షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మహిళలు మండిపడ్డారు.

హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఈ పథకాలను ఎత్తివేసేందుకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదని,తెలంగాణ పేద కుటుంబాల ఆడబిడ్డల భవిష్యత్తు,ఆత్మగౌరవంతో ముడిపడిన కార్యక్రమాలని పేర్కొన్నారు.

తెలంగాణ ఏర్పడిన వెంటనే పేద కుటుంబాల్లో ఆడబిడ్డ పెళ్లి ఎంతటి ఆర్థిక భారమో గుర్తించిన కేసీఆర్ 2014 అక్టోబర్ 2న ఈ పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు.రూ. 51 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభమైన ఈ పథకాన్ని దశలవారీగా రూ.75,116కు,అనంతరం రూ.1,00,116కు పెంచారని తెలిపారు.కేసీఆర్ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందిందన్నారు.కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి ద్వారా పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు.

అయితే ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని బలోపేతం చేయాల్సింది పోయి దానినే రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని మహిళలు విమర్శించారు.కళ్యాణ లక్ష్మి కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఆడబిడ్డ ఇప్పుడు ఎన్నికల హామీ ప్రకారం తులం బంగారం కూడా డిమాండ్ చేస్తుండటంతో ఆ ప్రశ్నల నుంచి తప్పించుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్హులైన లబ్ధిదారులే చెబుతున్నారని అన్నారు.పెళ్లిళ్లు జరిగి చాలా కాలం గడిచినా, కొందరికి పిల్లలు పుట్టినా కూడా తమకు రావాల్సిన కళ్యాణ లక్ష్మి సహాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారని ధ్వజమెత్తారు.

చాలా కాలం తర్వాత ఆమోదం పొందిన దరఖాస్తులకు సంబంధించిన చెక్కులు కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాకుండా ఆగిపోయాయని పేర్కొన్నారు.పెండింగ్‌లో ఉన్న అన్ని అర్హులైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం బారాస పార్టీ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు,భారస పార్టీ సీనియర్ మహిళలు శైలజ,రమాదేవి,దేవి,రాధిక,విజయలక్ష్మి,శ్రీలత, కల్పన,వసంత,లక్ష్మి,వాణి తదితరులు పాల్గొన్నారు

## అమ్మవారి ఫలహార బండి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
బోనాల పండుగ నేపథ్యంలో ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్ల నందు నిర్వహించిన అమ్మవారి ఫలహార బండి కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ప్రజల ప్రాణాలను కాపాడండి..

## రోడ్డు మరమ్మతులు చేపట్టండి..



**నాగోల్,(ప్రజావినికిడి):**
జైపూరి కాలనీ చౌరస్తా నుండి హనుమాన్ నగర్ వరకు రోడ్డు పూర్తిగా ప్రమాదకరంగా మారింది. గుంతలు, అధ్వాన్నమైన రహదారి కారణంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.ప్రజల ప్రాణాలకు ప్రమాదం జరగకముందే వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టి,ప్రజలను ప్రమాదాల నుండి కాపాడాలని ఐదు రోజుల నుండి అధికారులకు తెలియజేసినాకానీ ఇప్పటివరకు ఏ అధికారి పట్టించుకోలేదు ఈ ప్రమాదం నుండి కాపాడండి సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేస్తున్నాము అని జైపూరి కాలనీ ప్రజలు కోరుకుంటున్నానరు.

## జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి
# దేవాలయంలో గరుడ పంచమి వేడుకలు

**శ్రీ మహావిష్ణువుకు పరమ భక్తుడు గరుత్మంతుడు**

**టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు,మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు.**

**గరుడ పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు**

**పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
జానంపేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో గరుడ పంచమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### గరుడ పంచమి విశిష్టత వివరించినా మాజీ ఎమ్మెల్యే బక్కని

గరుత్మంతుడు పక్షులకు రాజు అని సర్పజాతికి శత్రువు.ఆయన గొప్పదనమంతా విష్ణుమూర్తిని వాహనరూపుడై సేవించడంలోనే ఉంది.నిరంతర స్వామి పాదసేవా పరాయణుడు గరుడుడు.అపార శక్తికి,అద్భుత గమనానికి సంకేతంగా ఆ పక్షిరాజునుదేవతలుభావిస్తారు. వినతాసుతుడైనందునవైనతేయుడయ్యాడు. గరుత్మంతుని అన్న అయిన అనూరుడు సూర్యునికి రథసారథయ్యాడు. రెండో కుమారుడైన గరుడుడు విష్ణుమూర్తికివాహనమయ్యాడు.దేవేంద్రుని వజ్రాయుధం దెబ్బలను కూడా తట్టుకోగలిగిన శక్తి గరుత్మంతుని రెక్కలకు ఉంది.అందుకే ఆయనను సుపర్ణుడు అన్నారు. అందువల్లనే దేవేంద్రుని ఓడించి అమృతాన్ని తెచ్చి సవతి తల్లికిచ్చి కన్నతల్లికి దాస్య విముక్తి కలిగించాడు.ఈ విధంగా తల్లికి దాస్య విముక్తి కలిగించిన రోజే శ్రావణ శుద్ధ పంచమి.విష్ణువు పతాకం మీద గరుత్మంతుడు



గరుత్మంతుడు కి బక్కని అభిషేకం



అధిష్ఠించి ఉంటాడు. విష్ణునామాల్లో గరుడధ్వజుడనేది ప్రసిద్ధ నామమని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, గరుడ పంచమి హిందూ సంప్రదాయంలో విశిష్టమైన పర్వదినమని అన్నారు.శ్రీ మహావిష్ణువుకు పరమ భక్తుడైన గరుత్మంతుడిని పూజించే ఈ రోజున భక్తులు స్వామివారిని,గరుడ దేవుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారని తెలిపారు.ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్,మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్,టిడిపి సీనియర్ నాయకులు కుమార్ గౌడ్,నాయకులు చెంది తిరుపతిరెడ్డి,సాయి ఈశ్వర్ రెడ్డి,డంగు శ్రీనివాస్ యాదవ్,కేకే కృష్ణ,ఒగ్గు కిషోర్,రాంభూపాల్,జాంగారి రవి,నందిగామ గ్రామ సర్పంచ్ కొమ్ము కృష్ణ,మాజీ కౌన్సిలర్ ప్రతాపరెడ్డి, కానుగు అనంతయ్య,పలభట్ల బాలరాజ్, రాచమల్ల కృష్ణయ్య,డాక్టర్ వెంకటరమణ,జర్నలిస్టులు మోహన్ రెడ్డి, మల్చలం రమేష్,లింగారెడ్డిగూడ ఉపసర్పంచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బోనాల జాతర

**ప్రత్యేక పూజలు చేసిన మధు యాష్కీ గౌడ్**





**ఎల్బీనగర్,ఆగస్ట్ 17,(ప్రజావినికిడి):**
హయత్ నగర్ బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగింది.భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా హయత్ నగర్ లోని పెద్దమ్మ తల్లి దేవాలయానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ అమ్మవారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లి దేవాలయం ఆవరణలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన షెడ్డును ప్రారంభించి అనంతరం అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మధు యాష్కీ గౌడ్ అన్నారు.ఈ కార్యక్రమంలో దేవాలయం సభ్యులు హయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ గౌడ్ గజ్జి భాస్కర్,నీరు సహదేవ్ పిడుగు సుభాష్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బీహార్ అశోక్‌ధామ్ ఆలయంలో తొక్కిసలాట

**ఏడుగురు భక్తుల దుర్మరణం**



**పాట్నా,ఆగస్ట్ 17,(ప్రజావినికిడి):**
బిహార్‌లో విషాదం చోటుచేసుకుంది. లఖిసరాయ్ జిల్లాలోని అశోక్‌ధామ్ ఆలయంలో సోమవారం తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. శ్రావణమాసం సోమవారం కావడంతో ఈ శివాలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. అయితే వారి మధ్యలో ఒక ఎలక్ట్రిక్ వైర్ తెగిపడిపోవడంతో ఒక్కసారిగా భయపడిపోయారు. షాక్ కొడుతుందనే ఆందోళనతో అక్కడినుంచి బయటకు పరిగెత్తే క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో గాయపడినవారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు సత్వర చికిత్స అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలు రూ.4 లక్షల పరిహారం ప్రకటించారు.భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి వచ్చారు. దానికి తగ్గట్టే మేం ఏర్పాట్లు చేశాం. భయాందోళన కారణంగా వారు పరిగెత్తడంతో బారికేడ్లు పడిపోయాయి. దాంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. ఈ ఘటనకు ఎలక్ట్రిక్ వైర్ కారణంగా తెలుస్తోంది. ధ్రువీకరించుకున్న తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని లఖిసరాయ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ వెల్లడించారు.

## బెంగాల్ తారాపీఠ్ హోటల్‌లో మంటలు

**మంట క్షణాల్లో వ్యాపించడంతో ఏడుగురు మృతి**



**కోల్‌కతా,ఆగస్ట్ 17,(ప్రజావినికిడి):**
పశ్చిమ బెంగాల్ లోని బీర్‌భూమ్ జిల్లా తారాపీఠ్‌లో ఒక హోటల్‌లో మంటలు చెలరేగడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం తెల్లవారుజామున గ్రౌండ్‌ఫ్లోర్‌లోని హోటల్ రిసెప్షన్‌లో ఈ మంటలు మొదలయ్యాయి. క్షణాల్లోనే భవనమంతా వ్యాపించాయి. అప్పుడు అతిథులంతా నిద్రలో ఉన్నారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. ఓ నాలుగు అంతస్తుల హోటల్ భవనంలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ఏడుగురు సజీవ దహనం కాగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈరోజు తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో హోటల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఏసీ యూనిట్లలో సాంకేతిక లోపం కారణంగా మంటలు వ్యాపించాయి. భారీగా మంటలు చెలరేగడంతో గ్రౌండ్ ఎ÷-లోర్ మొత్తం క్షణాల్లోనే పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న సహాయక బృందాలు.. స్థానికులతో కలిసి రక్షణ చర్యలు చేపట్టారు.౯÷ర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేసి మృతులను, గాయపడిన వారిని రాంపూర్‌హాట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, బాధితులంతా ప్రసిద్ధ కాళీ ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులుగా తెలుస్తోంది. అగ్నిప్రమాద ఘటనపై కోల్‌కతాకు చెందిన ఓ బాధిత మహిళ అతిథి స్పందించారు. హోటల్ మొత్తం పొగతో నిండిపోయిందని, దాని వల్ల చాలా మంది తప్పించుకోలేక పోయారని తెలిపారు. అలాగే, పలువురు శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బంది పడ్డారని వెల్లడించారు. బయటకు వచ్చేందుకు దారీ కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హోటల్‌లో కనీస అగ్నిమాపక భద్రతా చర్యలు లేవని ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. ౯÷ర్ అలారం కూడా పనిచేయలేదని పేర్కొన్నారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సోలార్ పవర్‌లో స్వయం సమృద్ధి సాధించాలి !

**ఆగస్ట్ 17,(ప్రజావినికిడి):**
దేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలని, విదేశాలపై ఆధారపడడం మానుకోవాలని ప్రధాని మోడీ ఎర్రకోట్ నుంచి ఇచ్చిన సందేశం ఆలోచింపచేసేదిగా ఉంది. అయితే దేశాన్ని స్వయం సమృద్ధిగా నిలపాల్సిన బాధ్యత పాలకులదే. ముఖ్యంగా ఇంధన, ఆహార రంగాల్లో మనం మరింత బలం కావాల్సి ఉంది. 140 కోట్ల జనాభా కలిగిన భారత్ తన ఇంధన అసవరాల కోసం విదేశాలపై ఎక్కువగా ఆధారపడు తోంది. 88.5 శాతం ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోంది. సహజవాయువు, పెట్రోలియం ఇలా అన్నింటికి గల్ఫ్, రష్యా, అమెరికా వంటి దేశాలే దిక్కు. అంతర్జాతీయ పరిణామాలకు భారత ఇంధన భద్రత ఒడిదొడు కులకు లోనవుతోంది. ఇటీవల హార్ముజ్ జలసంధి, ఇరాన్ అమెరికా యుద్ధం వల్ల భారత్ లో ఎల్పీజీ కొరత ఏర్పడింది. ఎక్కువ దిగుమతుల వల్ల విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. ఒక్క యుద్ధం వస్తే ఎంతగా ఒడిదుడుకులకు లోనవుతాం. అందువల్ల సహజ వనరులను అభివృద్ది చేసుకుంటూ పోవాలి. విదేశాల నుంచి అదేపనిగా అవసరం ఉన్నా లేకున్నా దిగుమతలును చేసుకోవడం వల్ల దేశీయంగా ధరలు పరుగులు పెడుతున్నాయి. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి. ముఖ్యంగా ఉప్పులు, పప్పులు, నూనెలపై ఆంక్షలు విధించుకోవాలి. దేశీయంగా ఆహార ఉత్పత్తులను పెంచుకోవాలి. సేంద్రియ వ్యవసాయం తప్పనిసరి చేయాలి. ఇకపోతే గ్యాస్, పెట్ర తదితర ఉత్పత్తులపైనా అన్వేషణ సాగాలి. మన సముద్ర భాగాల్లోనే గ్యాస్ లేదా పెట్రోలియం నిల్వలు వెలుగులోకి వస్తే భారతదేశానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రధాని మోడీ కూడా సముద్ర మథనం గురించి చెప్పారు. ఆగస్టు 15 స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగిస్తూ.. సముద్ర మంథన్ ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. భారత జలాల్లో సముద్ర అడుగు



భాగాల్లో ఇంధన వనరుల కోసం అన్వేషన కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్ని వెల్లడించారు. భారత్ తన ఇంధన అవసరాల్లో మెజారిటీ దిగుమతులపై ఆధారపడు తోంది. అయితే, గతంలో భారత్‌లో ఆఫ్‌షోర్ అన్వేషణకు సంబంధించిన ప్రాంతాల్లో దాదాపు 99 శాతం ప్రాంతాన్ని గతంలో 'నో-గో' జోన్‌లుగా ప్రకటించినట్లు, ఇప్పుడు వాటిలో చాలా ప్రాంతాలను అన్వేషణ కోసం తెరిచినట్లు ఆయన వెల్లడించారు. దీనివల్ల గ్యాస్, పెట్రోలియం వంటి ఇంధనాన్ని గుర్తించే పక్రియ మరింత వేగవంతం కానుంది. భారత్ ఇంధన నిల్వల్ని అన్వేషించేందుకు 'సముద్ర మంథన్' అనే నేషనల్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ఎ÷-లోరేషన్ స్కీమ్ ప్రకటించింది. భారతదేశ సముద్ర తీర ప్రాంతాల్లోని బేసిన్లలో చమురు, సహజ వాయువు నిల్వలను గుర్తించి భవిష్యత్తులో ఉత్పత్తి పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. 2026 జూలై 31న కేంద్ర మంత్రివర్గం ఈ పథకానికి 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు రూ.84,084 కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులో సముద్ర అడుగుభాగంలోని భౌగోళిక నిర్మాణాలను గుర్తించేందుకు సిస్మిక్ సర్వేలు, డీప్ సీ, అల్ట్రా డీప్ వాటర్ డ్రిల్లింగ్,సైంటిఫిక్ డ్రిల్లింగ్, సాధారణ ఆఫ్‌షోర్ మౌలిక వసతులు, చమురు-గ్యాస్ తయారీ వంటివి ఉంటాయి. ఈ పథకం ద్వారా 600 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా ఆయిల్ ఈక్వివలెంట్ హైడ్రోకార్బన్ నిల్వలు దేశానికి సమకూర్చవచ్చని, దేశీయ ఉత్పత్తి పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ ప్రకారం భారత్‌కు తొమ్మిది ఆఫ్‌షోర్ బేసిన్లు ఉన్నాయి. ఇవి మొత్తం సుమారు 17.3 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం నో-గో ఏరియా ప్రాంతాలను 13.67 లక్షల చదరపు కిలోమీటర్ల నుంచి 24,832 చదరపు కిలోమీటర్లకు తగ్గించారు. దీని ద్వారా భారత్‌కు చెందిన 23.6 లక్షల చదరపు కిలోమీటర్ల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్(ఇఇజి)లో సుమారు 99 శాతం ప్రాంతం అన్వేషణకు అందుబాటులోకి

వచ్చింది. ఈ ఏరియాల్లో అన్వేషణ పెరుగుతుంది. అన్వేషణ పెరిగినంత మాత్రాన ఖచ్చితంగా గ్యాస్, పెట్రోలియం ఉంటుదని హామీ ఇవ్వదు. డీప్-సీ ఎక్స్‌ప్లోరేషన్ చాలా ఖరీదైనది, సాంకేతికంగా క్లిష్టమైనది, ఫలితాలు అనిశ్చితంగా ఉండే పక్రియ. అందుకే మెరుగైన భౌగోళిక డేటా, మరిన్ని డ్రిల్లింగ్ కార్యకలాపాలు, కొత్త మౌలిక వసతుల ద్వారా అన్వేషణ నుంచి ఉత్పత్తి దశకు చేరే అవకాశాలను 'సముద్ర మథన్' పెంచే ప్రయత్నం చేస్తోంది. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే భారత ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గుతుంది. అదే సమయంలో బయో ఇంధనాలపైనా ప్రయత్నాలు సాగాలి. పరిశోధనలు చేపట్టాల్సి ఉంది. సోలార్ పవర్ పరిశోధనలు విస్తృతం కావాలి. దీనిలో విజయం సాధిస్తే ఇంధన కొరతను అధిగమించవచ్చు. ఈ దిశగా పరిశోధనలు పెరగాలి. సోలార్ పవర్‌ను చౌకగా ఉత్పత్తి చేసుకునే దశకు చేరుకోవాలి. అప్పుడే మనకు భవిష్యత్ సులువు కాగలదు. అతిగా విదేవాలపై ఆధారపడాల్సిన ఆగత్యం పోతుంది. దీంతో ఇంధన అవసరాలతో పాటు, విద్యుత్ సంక్షోభం కూడా తొలగనుంది.

## ఇక మండలస్థాయిలోనే ప్రజావాణి ఫిర్యాదులు

**గోవిందరావుపేటలో ప్రారంభించిన సీతక్క**

**ములుగుఆగస్ట్ 17,(ప్రజావినికిడి):**
ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని గోవిందరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మంత్రి సీతక్క సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. గతంలో ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతి సోమవారం ములుగు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని మంత్రి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి మండల కేంద్రంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇకపై గోవిందరావుపేట మండల ప్రజలు సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానిక అధికారులకు దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను స్వీకరించి, పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని మంత్రి సీతక్క సూచించారు.



# రుతురాజ్ గైక్వాడ్ చెత్త కెప్టెన్..

**అతని కెప్టెన్సీలో సీఎస్‌కే ప్లే ఆఫ్స్ కూడా చేరదు**

**రుతురాజ్ పై సంజూ శాంసన్ తీవ్ర విమర్శలు!!**

చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ చెత్త కెప్టెన్ అని ఆ జట్టు స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ అన్నట్లు ఓ ఫేక్ న్యూస్ నెట్టింట వైరల్ అవుతుంది. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో సీఎస్‌కే ఫైనల్ కూడా చేరదని సంజూ అన్నట్లుగా ఉన్న ఈ పోస్ట్ నెట్టింట తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే ఈ ఫేక్ పోస్ట్ అని భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా అన్నాడు. ఏ ఇంటర్వ్యూలో కూడా సంజూ ఈ వ్యాఖ్యలు చేయలేదని తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడుతూ స్పష్టం చేశాడు. సీఎస్‌కే తరఫున ఏ బాధ్యతలైనా చేపట్టేందుకు సిద్దంగా ఉన్నానని సంజూ అన్నట్లుగా ఈ ఫేక్ పోస్ట్‌ను క్రియేట్ చేశారు. 'రుతురాజ్ విఫలమయ్యాడు.. సీఎస్‌కే సారథ్య బాధ్యతలు అందుకునేందుకు సిద్దంగా ఉన్నారా 'అని ఇంటర్వ్యూయర్ ప్రశ్నించగా.. 'అవును. సీఎస్‌కే తరఫున ఏ బాధ్యతలైనా చేపట్టేందుకు రెడీగా ఉన్నా. కెప్టెన్‌గా నాకు అనుభవం ఉంది. రుతురాజ్ సారథ్యంలో సీఎస్‌కే సాధించిందేం లేదు.అతనో చెత్త కెప్టెన్. వరల్డ్ బెస్ట్ ఎలెవన్ ఇచ్చినా అతను ఏం చేయలేడు. కనీసం సీఎస్‌కేను ప్లే ఆఫ్స్ కూడా చేర్చలేడు. సీఎస్‌కే నాకు కెప్టెన్సీ బాధ్యతలు ఇస్తే.. స్వీకరిస్తా. రుతురాజ్ ఏం చేయలేడు. అందుకే సీఎస్‌కే సారథ్య బాధ్యతలు చేపట్టాలనుకుంటున్నా.'అని సంజూ శాంసన్ అన్నట్లుగా ఫేక్ పోస్ట్ క్రియేట్ చేశారు. ఈ పోస్ట్‌పై స్పందించిన ఆకాశ్ చోప్రా.. ఫేక్ అని తేల్చేసాడు. అందరూ నమ్మదగిన రీతిలో రాసుకొచ్చారని పేర్కొన్నాడు. ఇలాంటి ఇంటర్వ్యూ జరగలేదని స్పష్టం చేశాడు. 'సీఎస్‌కే తరఫున ఎలాంటి బాధ్యతలైనా చెప్పట్టేందుకు సిద్దంగా ఉన్నానని సంజూ చెప్పాడు. ఇది సరైనదే. నమ్మదగిన రీతిలోనేఉంది. ఇంటర్వ్యూయర్ రుతురాజ్ విఫలమయ్యాడు. సీఎస్‌కే సారథ్య బాధ్యతలు చెపడుతారా అని అడిగాడు. సంజూ.. అందుకు సిద్దంగా ఉన్నానని, సీఎస్‌కే కోసం ఏమైనా చేస్తానని, రుతురాజ్ సారథ్యంలోనే సీఎస్‌కే సాధించిందేం లేదన్నాడు. రుతురాజ్ చెత్త కెప్టెన్. అతను జట్టును ప్లే ఆఫ్స్ కూడా చేర్చలేడని చెప్పాడు. జనాలు ఈ పోస్ట్ చదివితే నిజమేనని అంటారు. సీఎస్‌కే కెప్టెన్సీకి సంజూనే సరైనవాడని కూడా అంటారు. అతనికి ఒక్క అవకాశం ఇవ్వాలని కూడా సూచిస్తారు. అయితే కొందరు మాత్రం ఈ ఇంటర్వ్యూ లింక్ అడిగారు. అయితే ఈ ఇంటర్వ్యూ ఎక్కడా జరగలేదు. సంజూ శాంసన్ ఎక్కడా ఇలా చెప్పలేదు. ఇది ఫేక్ న్యూస్. అసలు ఈ తరహా ఇంటర్వ్యూనే జరగలేదు. సంజూ అనలేదు'అని ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు. 2024 నుంచి సీఎస్‌కే ప్లే ఆఫ్స్ చేరలేదు.




# చరిత్ర సృష్టించిన రవీంద్ర జడేజా..




టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు.టెస్ట్ క్రికెట్‌లో 350 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. తద్వారా టెస్ట్‌ల్లో 350 వికెట్లతో పాటు 4000కిపైగా పరుగులు చేసిన రెండో భారత ఆల్‌రౌండర్‌గా నిలిచాడు. శ్రీలంకతో గాలే వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో రవీంద్ర జడేజా ఈ ఫీట్ సాధించాడు. శ్రీలంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా,కేశర నువంతలను ఔట్ చేయడం ద్వారా ఈ ఘనతను అందుకున్నాడు. ఓవరాల్‌గా టెస్ట్‌ల్లో 350 వికెట్లు తీసిన ఐదో బౌలర్‌గా జడేజా నిలిచాడు. అతనికి ముందు అనిల్ కుంబ్లే(619), రవిచంద్రన్ అశ్విన్(537), కపిల్ దేవ్(434), హర్భజన్ సింగ్(417) మాత్రమే 350 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో ఇప్పటి వరకు జడేజా 4,095 పరుగులు చేశాడు. 350 వికెట్లతో పాటు 4000 ప్లస్ రన్స్ చేసిన నాలుగో ఆల్‌రౌండర్‌గా జడేజా నిలిచాడు. కపిల్ దేవ్, ఇయాన్ బోథమ్(ఇంగ్లండ్), డేనియల్ వెటోరి(న్యూజిలాండ్) మాత్రమే జడేజా కంటే ముందు ఈ ఫీట్ సాధించాడు. అంతేకాకుండా టెస్ట్‌ల్లో అత్యధిక వికెట్లు తీసిన లెఫ్టార్మ్ స్పిన్నర్లలో జడేజా మూడో స్థానంలో నిలిచాడు. రంగన హెరత్(శ్రీలంక) 433 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా.. డేనియల్ వెటోరి(న్యూజిలాండ్) 362 వికెట్లు, రవీంద్ర జడేజా(భారత్) 350 వికెట్లు, డెరెక్ అండర్ వుడ్(ఇంగ్లండ్) 297 వికెట్లు, తైజుల్ ఇస్లామ్(బంగ్లాదేశ్) 271 వికెట్లు ఈ జాబితాలో ఉన్నారు. టెస్ట్‌ల్లో కనీసం 125 వికెట్లు తీసిన లెఫ్టార్మ్ స్పిన్నర్లలో సౌతాఫ్రికాకు చెందిన కేశవ్ మహారాజ్(56.4) తర్వాత జడేజా(58.1) రెండో అత్యుత్తమ స్ట్రైకరేట్‌ను కలిగి ఉండటం మరో విశేషం. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు ఆలౌటైంది. దేవదత్ పడిక్కల్(230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 167) సెంచరీతో రాణించగా.. కేఎల్ రాహుల్(175 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 82) శతకాన్ని చేజార్చుకున్నాడు. ధ్రువ్ జురెల్(68 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య(4/109) నాలుగు వికెట్లు తీయగా.. కేశర నువాంత(3/175) మూడు వికెట్లు పడగొట్టాడు. అసితా ఫెర్నాండో(2/63) రెండు వికెట్లు తీసాడు.అనంతరం శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 79.4 ఓవర్లలో 284 పరుగులకు ఆలౌటైంది. సోనాల్ దినుషా(100) సెంచరీతో చెలరేగగా.. నిరోషన్ డిక్‌వెల్లా(115 బంతుల్లో 7 ఫోర్లతో 80) హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(4/76) నాలుగు వికెట్లు తీయగా.. రవీంద్ర జడేజా(3/57) మూడు వికెట్లు పడగొట్టాడు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు. దాంతో భారత్‌కు 178 పరుగుల భారీ ఆధిక్యం లభించింది.

# ఇంగ్లాండ్ చేతిలో భారత్‌కు ఓటమి

**హాకీ వరల్డ్‌కప్‌లో భారత్‌కు తొలి ఓటమి**

**ఉత్కంఠభరితంగా కొనసాగిన మ్యాచ్**

**19న పాకిస్థాన్‌తో భారత్ మూడో మ్యాచ్**

2026 హాకీ వరల్డ్‌కప్‌లో భారత్ పురుషుల జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. పూల్ డీలో భాగంగా సోమవారం ఇంగ్లాండ్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో భారత్ 4-2 తేడాతో ఓడిపోయింది. దీంతో రెండో రౌండ్‌కు భారత్ అర్హత సాధించాలంటే తదుపరి పాకిస్థాన్‌పై మ్యాచ్‌లో తప్పక నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ వేల్స్‌పై ఇంగ్లాండ్ గెలిస్తే, పాక్‌తో మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా సరిపోతుంది. పూల్ స్టేజ్‌లో భాగంగా ఆమ్‌స్టల్‌వీన్‌లోని వాగ్నర్ హాకీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. తొలి క్వార్టర్‌లో ఇంగ్లాండ్ జట్టు ప్రారంభంలోనే ఒక గోల్ చేసి 1-0 ఆధిక్యాన్ని సాధించింది. అయితే, రెండో క్వార్టర్‌లో భారత్ అద్భుతంగా పుంజుకుంది. ఏకంగా రెండు గోల్స్ సాధించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్ ద్వారా ఒక గోల్ చేయగా, అదే క్వార్టర్‌లో దిల్ప్రీత్ సింగ్ మరో గోల్ చేసి భారత్‌కు 2-1 ఆధిక్యాన్ని అందించారు. అయితే మూడో క్వార్టర్‌లో ప్రత్యర్థి ఇంగ్లాండ్ జట్టు బలంగా పుంజుకుంది. ఆ జట్టు కొంతసేపటికే భారత్ స్కోరును సమం చేసింది. అంతేకాకుండా అదే దూకుడును ప్రదర్శించడంతో 3-2తో లీడ్‌లోకి దూసుకెళ్లింది. నాలుగో క్వార్టర్‌లో భారత్‌కు కోలుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. అదే ఊపులో ఉన్న ఇంగ్లాండ్ ఇంకో గోల్ చేసి తమ ఆధిక్యాన్ని 4- 2కు పెంచుకుంది. ఇంగ్లాండ్ తరఫున స్టువర్ట్ రష్‌మెర్, హెన్రీ క్రాఫ్ట్, నికోలస్ బందూరక్ చివరి మూడు గోల్స్ సాధించారు. చివరి నిమిషాల్లో భారత్ పోరాట పటిమను ప్రదర్శించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో మ్యాచ్ 4- 2తో ముగిసింది. ఇక ఈ టోర్నీలో భారత్ తమ మూడో మ్యాచ్ పాకిస్థాన్‌తో ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్ ఆగస్టు 19న ఉండనుంది. కాగా, ఈ మ్యాచ్ ఆరంభమైన తీరు చూస్తే భారత్ సరికొత్త చరిత్ర సృష్టించేలాగే కనిపించింది. ఎందుకంటే 1994 నుంచి ప్రపంచ కప్‌లో ఇంగ్లాండ్‌ను భారత్ ఓడించలేదు. ఈ మ్యాచ్‌లో గెలుపు పక్కా అనుకున్నారంతా. కానీ అసలైన సమయ ంలో ఇంగ్లాండ్ పుంజుకోవడంతో టీమ్ఇండియాకు ఓటమి తప్పలేదు. అయితే పారిస్ ఒలింపిక్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో మాత్రం ఇంగ్లాండ్‌ను టీమ్ఇండియా ఓడించింది. ఇరుజట్లు కూడా తమ ప్రారంభ మ్యాచ్‌లలో విజయం సాధించి రెండో గేమ్‌లో అడుగుపెట్టాయి. భారత్ తమ తొలి మ్యాచ్‌లో వేల్స్‌ను 3-1తో ఓడించి (ఈ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ చేశాడు) ప్రపంచ కప్‌లో శుభారంభం చేసింది. మరోవైపు పాకిస్థాన్‌ను 4-1 తేడాతో ఇంగ్లాండ్ ఓడించింది. దీంతో గ్రూప్ డీలో ఇంగ్లాండ్ టాప్‌లో కొనసాగుతోంది. రెండు మ్యాచ్‌లు ఆడగా, రెండింట్లోనూ విజయం సాధించిన ఆ జట్టు 6 పాయింట్లతో టాప్‌లో ఉంది.




రెండింట ఒకదాంట్లో నెగ్గిన భారత్ (3 పాయింట్లు) రెండో ప్లేస్‌లో ఉంది. ఆ తర్వాత ఒక్కో పాయింట్‌తో వేల్స్, పాకిస్థాన్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే పట్టికలో టాప్ 2లో నిలిచిన జట్లు మాత్రమే తదుపరి దశకు చేరుకుంటాయి.

# భారత్‌కు భారీ ఆధిక్యం!

**శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకు ఆలౌట్**

**సోనాల్ దినుషా సెంచరీ.. రాణించిన నిరోషన్ డిక్‌వెల్లా**

**నాలుగు వికెట్లతో అదరగొట్టిన బౌలర్ మానవ్ సుతార్**

**భారీగా వర్షం రావడంతో ముగిసిన మూడో రోజు ఆట..**

శ్రీలంకతో తొలి టెస్ట్‌లో భారత్‌కు భారీ ఆధిక్యం లభించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 79.4 ఓవర్లలో 284 పరుగులకు కుప్పకూలింది. సోనాల్ దినుషా(100) సెంచరీతో చెలరేగగా.. నిరోషన్ డిక్‌వెల్లా(115 బంతుల్లో 7 ఫోర్లతో 80) హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(4/76) నాలుగు వికెట్లు తీయగా.. రవీంద్ర జడేజా(3/57) మూడు వికెట్లు పడగొట్టాడు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు. అంతకుముందు 460/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు కుప్పకూలింది. దేవదత్ పడిక్కల్(230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 167) సెంచరీతో రాణించగా.. కేఎల్ రాహుల్(175 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 82) శతకాన్ని చేజార్చుకున్నాడు. ధ్రువ్ జురెల్(68 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు.

శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య(4/109) నాలుగు వికెట్లు తీయగా.. కేశర నువాంత(3/175) మూడు వికెట్లు పడగొట్టాడు. అసితా ఫెర్నాండో(2/63) రెండు వికెట్లు తీసాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు భారత బౌలర్లు షాకిచ్చారు. సిరాజ్, జడేజా, మానవ్ సుతార్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. దాంతో శ్రీలంక 99/5 స్కోర్‌తో లంచ్ బ్రేక్ కు వెళ్లింది. తొలి సెషన్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయిం చింది. రెండో సెషన్‌లో సొనాల్ దినుషా, నిరోషణ్ డిక్‌వెల్లా శ్రీలంకను ఆదుకున్నారు. అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ఈ క్రమంలో నిరోషన్ డిక్‌వెల్లా 67 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. దినుషా 92 బంతుల్లో అర్ధశతకాన్ని అందుకున్నాడు. దాంతో శ్రీలంక 215/5 స్కోర్ టీ బ్రేక్‌కు వెళ్లింది. దినుషా, డిక్‌వెల్ల అద్భుత బ్యాటింగ్‌తో రెండో సెషన్‌లో శ్రీలంకనే పైచేయి సాధించింది.ఆఖరి సెషన్‌లో భారత బౌలర్లు జూలు విధిల్చారు. 146 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. సెంచరీ దిశగా సాగిన నిరోషన్ డిక్‌వెల్లా(80)ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో మ్యాచ్ భారత్‌వైపు మలుపు తిరిగింది. ఆ వెంటనే కేశర నువాంత(2)ను జడేజా ఔట్ చేయగా.. ప్రభాత్ జయసూర్య (10)ను మానవ్ సుతార్ వెనక్కిపంపాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా మరోవైపు సోనాల్ దినూషా.. 167 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ మరుసటి బంతికే అతన్ని జడేజా ఎల్బీగా పెవిలియన్ మార్చా డు. లాహిరు కుమార(10)ను మానవ్ సుతార్ ఔట్ చేయడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఆ వెంటనే వర్షం రావడంతో అంపైర్లు మూడో రోజు ఆటను ముగించారు. నాలుగో రోజు ఆటలో భారత్ తొలి సెషన్‌లోనే 130 పరుగులు చేసి శ్రీలంక ముందు 300 ప్లస్ రన్స్ లక్ష్యాన్ని నమోదు చేయాలి. అప్పుడే ఈ మ్యాచ్ భారత్ వశమవుతోంది. వర్షం అంతరాయం కలిగిస్తున్న నేపథ్యంలో చాలా తెలివిగా ఆడాల్సిన అవసరం ఉంది.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# అల్లు అరవింద్ కామెంట్స్ పై యశ్ స్పందన

### అందరి కష్టం తోడైతేనే మంచి అవుట్‌పుట్ వస్తుందన్న యశ్



'కేజీఎఫ్' చిత్రంతో దేశ వ్యాప్తంగా అద్భుతమైన గుర్తింపు తెచ్చుకున్న కన్నడ రాకింగ్ స్టార్ యశ్... ప్రస్తుతం తన రాబోయే చిత్రం 'టాక్సిక్' ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో, గతంలో అల్లు అరవింద్ తనను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై ఒక ఇంటర్వ్యూలో సుదీర్ఘంగా స్పందించారు. కేజీఎఫ్ చిత్రం తన కెరీర్‌ను మలుపు తిప్పిందనే విషయాన్ని ఒప్పుకుంటూనే, ఒక సినిమా విజయం, దానికి వచ్చే గుర్తింపుపై తన అభిప్రాయాలను పంచుకున్నారు.ఒక సినిమా వల్ల నిర్మాత కంటే హీరోకే ఎక్కువ గుర్తింపు వస్తుందనే అంశంపై యశ్ మాట్లాడుతూ... విజయం అనేది కేవలం నిర్మాతకు లేదా ఒక్క వ్యక్తికి మాత్రమే సొంతం కాదని స్పష్టం చేశారు. క్యారెక్టర్ ఆర్టిస్టుల నుంచి రచయితల వరకు అందరి కష్టం తోడైతేనే మంచి అవుట్‌పుట్ వస్తుందని, ప్రధాన పాత్రలో నటించేవారు సరిగ్గా చేయలేకపోతే సినిమా కచ్చితంగా విజయం సాధించదని తెలిపారు. ప్రేక్షకుల నిర్ణయం ఎప్పుడూ తప్పు కాదని, ఎవరి శ్రమకు తగిన గౌరవం వారికి ఇవ్వడంలో ప్రేక్షకులు ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. ఎంతటి స్టార్ హీరో తలరాతనైనా శుక్రవారం విడుదలయ్యే ఆ ఒక్క రోజే నిర్ణయిస్తుందని, సినిమా ఆడకపోతే 'పాన్-ఇండియా' ట్యాగ్ కూడా మాయమైపోతుందని వ్యాఖ్యానించారు.

ఇదిలా ఉండగా, 2023లో ఓ సినిమా వేడుకలో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ "కేజీఎఫ్ కంటే ముందు యశ్ ఎంతమందికి తెలుసు?" అని ప్రశ్నిస్తూ, భారీ నిర్మాణ విలువలే ఆ సినిమా అంత పెద్ద హిట్ అవ్వడానికి కారణమని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో ఈ కామెంట్స్ పై యశ్ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, తాజాగా యశ్ స్పందిస్తూ.. ఇతరుల వ్యాఖ్యలు లేదా కామెంట్లు తన వ్యక్తిత్వాన్ని ఏమాత్రం మార్చలేవని తేల్చి చెప్పారు.



# అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుంది మరి!

ఒకప్పుడు మీనా .. రంభ .. నగ్మా వంటి బొద్దుగా ఉన్న బ్యూటీలు తెలుగు తెరను ఒక ఊపు ఊపేశారు. స్టార్ హీరోలతో కలిసి వరుస విజయాలను అందుకుంటూ, తమ కెరియర్ ను పరుగులు తీయించారు. అలా కాస్త బొద్దుగా కనిపిస్తూ .. క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ తో ఈ మధ్య కాలంలో యూత్ ను ఆకట్టుకున్న బ్యూటీగా రితికా నాయక్ కనిపిస్తుంది. 'మిరాయ్' సినిమాలో ఈ సుందరిని చూసిన కుర్రాళ్లు, థియేటర్స్ దగ్గరే మనసులు పోగొట్టుకున్నారు. ఈ ముద్దుగుమ్మ నెలకో సినిమా చేస్తే బాగుండునే అనుకున్నారు. కానీ 'మిరాయ్' మాదిరిగానే తనకి బాగా నచ్చే కంటెంట్ కోసం రితికా ఎదురుచూస్తూ వచ్చిందనే విషయం, 'కొరియన్ కనకరాజు' రిలీజ్ తరువాతనే అర్థమవుతోంది. రీసెంటుగా విడుదలైన ఈ సినిమా, అనూహ్యమైన రెస్పాన్స్ ను అందుకుంది. కొంత కాలంగా అసంతృప్తిగా ఉన్న వరుణ్ తేజ్ కి ఈ సినిమా ఫలితం ఊరటను ఇచ్చింది .. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ సినిమాలోను నటన పరంగా .. గ్లామర్ పరంగా రితికా మంచి మార్కులు కొట్టేసింది. అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుందని అనిపించింది. కొంత కాలంగా టాలీవుడ్ లో హీరోయిన్స్ వైపు నుంచి సందడి తగ్గిందనే చెప్పాలి. ఒకటి రెండు సినిమాలు చేసుకుపోతున్నారే తప్ప, నిలకడగా ఎవరూ సక్సెస్ లు సాధించలేకపోతున్నారు. టాప్ త్రీ .. టాప్ 5 అంటూ గతంలో మాదిరిగా ఒక జాబితా చూసుకుంటే, ఎవరూ కనిపించని ఒక గందరగోళం ఉంది. అలాంటి పరిస్థితుల్లో మరో భారీ హిట్ ను అందుకున్న రితికా, మరిన్ని అవకాశాలతో బిజీ అవుతుందేమో చూడాలి.

# హీరోకి తగ్గ ఫ్యాన్స్..

### సామాజిక సేవలో అల్లు అర్జున్ అభిమానుల రికార్డు



అభిమాన సంఘాలు అంటే కేవలం తమ హీరో సినిమాలను ప్రమోట్ చేయడానికే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతోనూ ముందుండొచ్చని ఐకాన్ స్టార్ 'అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్' (అఫా) నిరూపిస్తోంది. దేశవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరి మన్ననలు పొందుతోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వస్థ్ నారీ వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా 'అఫా' ఓ అరుదైన మైలురాయిని చేరుకుంది.

దేశంలోని ఏడు రాష్ట్రాల్లో 400కు పైగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, సుమారు లక్ష మంది యువతులకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, సర్వైకల్ క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించింది. యువతులు, బాలికలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతో అల్లు అర్జున్ అభిమానులు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేవలం సినిమాలపైనే కాకుండా సామాజిక అంశాలపై కూడా దృష్టి సారిస్తున్న 'అఫా' సభ్యుల కృషికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# భారత్‌లో 'స్పైడర్ మ్యాన్' వసూళ్ల సునామీ..

### రూ. 500 కోట్లు కొల్లగొట్టిన హాలీవుడ్ చిత్రం..

హాలీవుడ్ స్టార్స్ టామ్ హాలండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన సూపర్ హీరో చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. జులై 31న విడుదలైన ఈ సినిమా, అంచనాలకు మించి భారీ విజయాన్ని నమోదు చేస్తూ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద 2 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 19,120 కోట్లు) మార్క్‌ను దాటింది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ (ఎంసీయూ) నుంచి 38వ చిత్రంగా వచ్చిన ఈ సినిమా, కలెక్షన్ల పరంగా సరికొత్త రికార్డులు నెలకొల్పుతోంది.



ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా సంస్థ 'ది హాలీవుడ్ రిపోర్టర్' కథనం ప్రకారం.. ఈ చిత్రం ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 2.02 బిలియన్ డాలర్లను వసూలు చేసింది. కేవలం గ్లోబల్ మార్కెట్‌లోనే కాకుండా భారతీయ బాక్సాఫీస్ వద్ద కూడా ఈ చిత్రం ప్రభంజనం సృష్టించింది. ఇండియాలో రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, ఇక్కడ అత్యధిక వసూళ్లు రాబట్టిన హాలీవుడ్ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. భారీ విజయాలు సాధించిన క్రిస్టోఫర్ నోలన్ చిత్రం 'ది ఒడిస్సీ', 'అబ్సెషన్' రికార్డులను ఇది బద్దలు కొట్టింది. డెస్టిన్ డానియల్ క్రెటన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో టామ్ హాలండ్ మరోసారి స్పైడర్ మ్యాన్‌గా అద్భుతమైన నటన కనబరిచారు. జెండయా... మిచెల్ జోన్స్-వాట్సన్ పాత్రలో ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో స్పైడర్ మ్యాన్ ఒక కొత్త, శక్తిమంతమైన ప్రతినాయకుడిని ఎదుర్కోవడమే కాకుండా, శారీరకంగా ఊహించని మార్పులకు లోనవుతాడు. ఈ కాన్సెప్ట్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది.

# బోనాలపై ట్రోలింగ్..

### కన్నీళ్లు పెట్టుకున్న నటి ఫరియా అబ్దుల్లా



ప్రముఖ నటి, 'జాతి రత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా సోషల్ మీడియాలో భావోద్వేగానికి లోనయ్యారు. బోనాల పండుగలో పాల్గొన్నందుకు తనను ట్రోల్ చేస్తున్న వారిపై స్పందిస్తూ ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ద్వేషాన్ని ప్రేమతోనే జయిస్తానని, తన కుటుంబ నేపథ్యాన్ని వివరిస్తూ ఓ సుదీర్ఘ వీడియోను పోస్ట్ చేశారు. ఇటీవల హైదరాబాద్ పాతబస్తీలోని మీర్ ఆలం మండిలో ఉన్న శ్రీ మహాకాళేశ్వర అమ్మవారి ఆలయంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో ఫరియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె సంప్రదాయ దుస్తుల్లో బంగారు బోనం ఎత్తుకొని, డప్పు చప్పుళ్లకు ఉత్సాహంగా నృత్యం చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అయితే, ముస్లిం నేపథ్యం ఉన్న ఫరియా హిందూ పండుగలో పాలుపంచుకోవడాన్ని సోషల్ మీడియాలోని కొందరు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆమెను 'కాఫిర్' (మత విశ్వాసం లేని వ్యక్తి) అని సంబోధిస్తూ, మతానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారంటూ దారుణంగా ట్రోల్ చేశారు. ఈ ట్రోలింగ్‌పై ఫరియా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన వీడియోలో కన్నీళ్లు పెట్టుకున్నారు. "మా నాన్న (సంజయ్ అబ్దుల్లా) పుట్టుకతో హిందువు. ఆయన ఇస్లాం సిద్ధాంతాలు నచ్చి ఆ మతంలోకి మారారు. ఒక మతాన్ని అంతగా ఇష్టపడి స్వీకరించిన వ్యక్తి నన్ను పెంచినప్పుడు, నాకు అందులోని మంచి విషయాలే కనిపించాయి" అని ఆమె భావోద్వేగంగా చెప్పారు. "నన్ను 'కాఫిర్' అని పిలుస్తూ ద్వేషించే వారికి కూడా మంచి జరగాలనే కోరుకుంటాను. నేను ద్వేషాన్ని ప్రేమతోనే ఎదుర్కొంటాను" అని స్పష్టం చేశారు.

ప్రకృతిలోని చెట్లు, పుట్టలు, సీతాకోకచిలుకలు.. ఇలా ప్రతి అంశంలో తాను దైవాన్ని చూస్తానని ఫరియా తెలిపారు. అన్నింటిలో భగవంతుడిని చూడకపోతే జీవితంలో చాలా కోల్పోతామన్నారు. తన ప్రేమను, భావ ప్రకటన స్వేచ్ఛను ఎవరూ ఆపలేరని, ఇదే తన తిరుగుబాటు అని ఆమె తేల్చిచెప్పారు. ఫరియాకు మద్దతుగా నటి లక్ష్మీ మంచుతో పాటు పలువురు నెటిజన్లు, అభిమానులు నిలుస్తున్నారు.



# ముంతాజ్ ఐకానిక్ లుక్‌ను గుర్తు చేసిన శోభిత..

: టాలీవుడ్ హాట్ బ్యూటీ శోభితా ధూళిపాళ్ల గ్లోబల్ స్థాయిలో తనదైన స్టైల్‌తో మెప్పిస్తు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొత్త ఫోటోలు ఇప్పుడు నెట్టింట సంచలనం సృష్టిస్తున్నాయి. కాంతివంతమైన ఆరెంజ్ రంగు సారీలో వింటేజ్ వైబ్స్, మోడరన్ గ్లామర్ కలగలిపిన రూపంతో అందరినీ ఆకట్టుకున్నారు. బాలీవుడ్ ఐకానిక్ నటి ముంతాజ్ క్లాసిక్ శారీ లుక్‌ను రీక్రియేట్ చేస్తూ ఆమె ఇచ్చిన పోజులు ఫ్యాషన్ ప్రియులకు సరికొత్త గోల్స్ ఇస్తున్నాయి. ఆ విశేషాలు చూద్దాం..ఆరెంజ్ ఛార్మింగ్‌తో కేక పెట్టిస్తున్న పిక్స్: పచ్చని ప్రకృతి నేపథ్యం ముందు శోభితా ఆరెంజ్ రంగు బంధేజ్ పాటర్న్ చీరలో, దానికి తగినట్లుగా డిజైన్ చేసిన బ్యాక్‌లెస్ బ్లౌజ్‌లో మెరిసిపోయారు. ఇక సూర్యాస్తమయం వెలుగులో ఆమె కట్టిన చీర, ఎంబ్రాయిడరీ బోర్డర్ కాంతివంతంగా మెరుస్తూ రాయల్ లుక్‌ను ఇచ్చాయి. ఈ ఫోటోషూట్‌లో శోభితా నవ్వు, ఆమె ఒలికించిన సొగసు కుర్రకారును మైమరపిస్తున్నాయి. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో వినూత్నమైన ఆ స్ఫూర్తి: ఈ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ శోభితా రాసుకొచ్చిన క్యాప్షన్ మరింత ఆసక్తికరంగా మారింది. "ఆరెంజ్ ట్యాంగ్, పింట్రెస్ట్‌లో ముంతాజ్ చీర పిక్, సూర్యాస్తమయం, నిన్న రాత్రి ఫ్రిజ్‌లో దాచిన గాజర్ కా హల్వా, మరియు ససురాల్ గెందా ఫూల్ పాట.. వీటి నుంచే నాకు ఈ లుక్ స్ఫూర్తి లభించింది" అంటూ సరదాగా చెప్పుకొచ్చారు. ఇక ప్రతి అంశాన్ని తన శైలికి అనుగుణంగా మలచుకుని అద్భుతంగా మెరిశారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613